
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 10 జూలై 2024 | 5

తండ్రి వారసత్వంగా.. చోరీలు?

ప్రతి కొడుకూ తండ్రి వారసత్వంగా ఆస్తులు.. బాధ్యతలను తీసుకుంటాడు.. అతను మాత్రం చోరీలను వారసత్వంగా తీసుకున్నాడు.. రాజమహేంద్రవరంలోని కొంతమూరుకు చెందిన ఒక వ్యక్తి చోరీలు చేసేవాడు.. పలు కేసుల్లో నిందితుడు.. అయితే కరోనా సమయంలో అతను చనిపోయా డు.. ఆ తరువాత అతనిపై కేసులు క్లోజ్ అయిపోయాయి.. అయితే మంగళవారం మళ్లీ అతని ప్రస్తావన వచ్చింది.. ఎందుకంటే అతని కొడుకే చోరీల బాటపట్టాడు.. ఇటీవల పలు కేసుల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలు సేకరించగా అతని తండ్రిని మరొకసారి పోలీసులకు జ్ఞప్తికి తెచ్చాడు.. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. -7లో

ఇల్లు కట్టుకుంటే.. ఇసుక ఫ్రీ

సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.. ఎన్నికల హామీలో భాగంగా ఉచిత ఇసుకకు శ్రీకారం చుట్టారు.. కేవలం రవాణా ఖర్చులు చెల్లిస్తే సరి ఇసుక ఉచితం.. టన్నుకు అన్ని ఖర్చులు కలుపుకుని కేవలం రూ.270లే.. అయితే దూరాన్ని బట్టి ఇది మరికొంత పెరిగే అవకాశం ఉంది.. ఉచిత ఇసుక రవాణాను మంగళవారం లాలా చెరువు స్టాక్ పాయింట్ వద్ద మంగళవారం మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు.. గత ప్రభుత్వంలో ఇసుక అందక పేదోడు ఇంటి నిర్మాణం ఆగిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.. మా ప్రభుత్వంలో అలా కాకూడదనే ఉచిత ఇసుక విధానం తెచ్చామన్నారు. - 7లో



ఇసుక సంతోషమే : లాలాచెరువులో స్టాక్ పాయింట్ వద్ద జెండా ఊపి ఇసుక రవాణా ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ



చిట్యాలలో ఇల్లు.. మృతుడు అవినాష్ (ఫైల్)

కలలన్నీ కల్లలయ్యాయి!

తాము వ్యవసాయం చేసుకుంటూ కష్టపడుతున్నాం.. తమ ఒక్కగానొక్క కొడుకు అవినాష్ మాత్రం ఉన్నతచదువులు చదివి.. దర్జాగా బతకాలని ఆ తల్లిదండ్రులు ఆశించారు.. కష్టమైనా.. ఇల్లూ.. ఒళ్లూ తాకట్టుపెట్టి అగ్రరాజ్యం అమెరికాలో ఎంఎస్ చదివేందుకు పంపారు.. అయితే అక్కడ జరిగిన ప్రమాదంలో తమ కొడుకు మృత్యువాత పడ్డాడని తెలిసి.. ఇక మాకు దిక్కెవరంటూ గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, శిరీష దంపతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.. - మెయిన్‌లో..



కోట్లు మింగేసిన.. ఘనులు!

సీనరేజీలో కోట్లు పిండేసి..బాకీ కాదనేసి..

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వడ్డించేవాడు మనవాడైతే అడ్డేముంటుంది.. దోచుకోవచ్చు.. దాచుకోవచ్చు.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలా మంది పెద్దలు చేసిందిదే..ప్రస్తుతం అధికారం మారడంతో ఒక్కొక్కరి బాగోతం బయటపడుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆ కంపెనీ మొన్నటి వరకు క్వారీల నుంచి కాసులు పంట పండించుకుంది. లేటరైట్, గనులు, గ్రావెల్ తవ్వకాల నుంచి ముక్కుపిండి సీనరేజీ పేరుతో కోట్లకు కోట్లు దండేసుకుంది. ప్రభుత్వం తరపున గనుల శాఖ చేయాల్సిన పనని జగన్ ప్రభుత్వం ఏకంగా ఆ కంపెనీకి అడ్డగోలుగా గతేడాది ఏప్రిల్‌లో కట్టబెట్టేసింది. నువ్వు ఎన్ని కోట్లయినా పిండుకో..ప్రభుత్వానికి నెలకు కేవలం రూ.9.70 కోట్లు కడితే చాలంటూ బంపర్ ఆఫర్ ఇచ్చేసింది. ఇంకేం..అప్పట్లో ఓ అధికార పార్టీ నేత అండదండలతో ఆ కంపెనీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెచ్చిపోయింది. క్వారీలు, గుట్టలు, లేటరైట్, గనుల నుంచి వెళ్లే ప్రతిలారీ నుంచి సీనరేజీ పిండేసింది. నెలకు ప్రభుత్వానికి కట్టాల్సిన దానికంటే రెట్టింపు సొమ్మును చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి మరీ ముక్కుపిండి రాబట్టింది. తీరా ఇటీవల ప్రభుత్వం మారడంతో ఆ కంపెనీ దందాకు చెక్‌పడింది. కానీ ప్రభుత్వానికి కట్టాల్సి ఉన్న సీనరేజీ డబ్బులు మాత్రం ఇప్పటికీ కట్టకుండా డ్రామాలాడుతోంది. అప్పట్లో తన అనుయాయ కంపెనీకి జగన్ సర్కారు రూ.20 కోట్ల వరకు గుట్టుగా సీనరేజీ రద్దు చేయడాన్ని సాకుగా చూపుతోంది. ఆ రద్దు వల్ల తనకు రాబడి పడిపోవడంతో కట్టాల్సిన బాకీ నుంచి మినహాయింపు కోరుతోంది. ఎన్నికలకు ముందు అధికార పార్టీ పెద్దల ద్వారా రాయబారం నడిపింది. ఈలోపు కొత్త ప్రభుత్వం రావడంతో ఏం చేయాలో తెలీక అధికారుల ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు డ్రామా మొదలుపెట్టింది.

జగన్ సారూ.. ఉన్నారు?

గత జగన్ ప్రభుత్వంలో పాలన అంతా నిబంధనలకు విరుద్ధంగానే నడిచింది. గనులశాఖలో అయితే ఇక చెప్పనక్కర్లేదు. అడ్డగోలు నిర్ణయాలతో ఖజానాకు కోట్లలో గండి పడింది. వ్యక్తులకు మాత్రం భారీగా ఆర్థిక లబ్ధి

- సీనరేజీ కాంట్రాక్టులో అక్రమం
- ఏడాదికి రూ.407 కోట్ల ఆదాయం
- రెండేళ్లకు రూ.223 కోట్లకే ఒప్పందం
- అడ్డగోలుగా కట్టబెట్టిన జగన్ సర్కారు
- సర్కారుకు రూ.25 కోట్లకుపైగా బకాయి
- చెల్లించకుండా తప్పించుకునే యత్నం
- గనుల శాఖ నుంచి ఒత్తిడి
- ఉలుకూపలుకూ లేని సుధాకర్ ఇన్‌ఫ్రా
- జగన్ కంపెనీకి రూ.20 కోట్లు రద్దు?
- దానివల్ల రాబడి తగ్గిందని వింత వాదన
- బాకీలో మినహాయించాలని డిమాండ్
- కాంట్రాక్టు కంపెనీకి అధికారుల వత్తాసు
- ఎన్నికల ముందు ప్రభుత్వానికి లేఖ
- ప్రభుత్వం మారడంతో కంపెనీకి షాక్
- మే నుంచి నిలిచిన వసూళ్ల దందా

చేకూర్చేలా అప్పటి పాలకులు నిర్ణయాలు తీసుకున్నారు. జగన్‌కు చెందిన ఓ బినామీ కంపెనీ రౌతులపూడిలో భారీ కొండలో నల్లరాయి క్వారీ మైనింగ్‌కి అనుమతులు పొందగా దాని మైనింగ్‌కు సంబంధించి ప్రభుత్వానికి కోట్లలో సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అప్పటి ప్రభుత్వం పూర్తిగా ఈ కంపెనీ కోసం నిబంధనలకు పాతరేసింది. ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనుల శాఖకు కట్టక్కర్లేకుండా ఏకంగా మినహాయింపు ఇచ్చేసింది. తద్వారా రూ.20 కోట్ల వరకు సదరు కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిపెట్టింది. సీనరేజీ మినహాయింపు ఆదేశాలు మూడో కంటికి తెలియకుండా రహస్యం పాటించారు. ఇదంతా ఒకెత్తయితే నెలనెలా ప్రభుత్వానికి సుధాకర్ ఇన్‌ఫ్రా కట్టాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులను కొంతకొంతగా ఎగ్గొడుతూ వస్తోంది. ఇదేంటని అడిగితే జగన్ అనుయాయ కంపెనీకి రూ.20 కోట్ల వరకు సీనరేజీ మినహాయింపు ఇవ్వడంతో తన రాబడి తగ్గిపోయిందని కొన్ని నెలల కిందట కొత్త వాదన తెచ్చింది. ఈ నేపథ్యంలో రద్దు చేసిన రూ.20 కోట్ల సీనరేజీ డబ్బులో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్త పాట పాడింది. ఈ కంపెనీ వెనుక వైసీపీ నేత ఉం డడంతో కాకినాడ గనుల శాఖ ఉన్నతాధికారులు మొత్తబడ్డారు. సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా నెలవారీ చెల్లించాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులు బాకీ ఉందని, ఈ బాకీలకు ఓ కంపెనీకి ప్రత్తిపాడు నియోజకవర్గంలో రద్దు చేసిన రూ.20 కోట్లకు పైగా సీనరేజీ డబ్బుల్లో కొంత మొత్తాన్ని సర్దుబాటు చేయాలంటూ లేఖ రాశారు.అయితే అప్పటికే రాష్ట్రంలో ఎన్నికల హడావుడి మొదలవడం, ఎన్నికల కోడ్ కూడా వచ్చేయడంతో గత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. కానీ తాను అనుకున్న పని పూర్తి చేయించుకోవడం కోసం సుధాకర్ ఇన్‌ఫ్రా తెగ ప్రయ త్నాలు చేసింది. నెలనెలా కోట్లలో రెట్టింపు రాబడి పిండేసినా కట్టాల్సిన రూ.25 కోట్ల బాకీ చెల్లించకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేసింది. ఈలోపు ఎన్నికలు జరగడం, తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ బాకీలు కట్టకుండా ఆగిపోయింది. ఊహించని విధంగా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో సదరు కంపెనీకి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. కట్టాల్సిన బాకీలు చెల్లించాల్సి రావడం, అటు ప్రభుత్వం మారడంతో సీనరేజీ వసూలు కాంట్రాక్టు నుంచి కూడా తప్పుకోవాల్సి రావడం పెద్ద షాక్‌కు గురిచేసింది. దీంతో ఇప్పుడు సీనరేజీ వసూలు ఎక్కడికక్కడ ఈ కంపెనీ చేయకుండా గనులశాఖ డీడీ కార్యాలయం చెక్‌పెట్టింది. కొత్త ప్రభుత్వంలో తన ఆటలు సాగే అవకాశం లేకపోవడంతో రూ.25కోట్లు ఎగ్గొట్టే ఎత్తు గడలో భాగంగా తిరిగి జిల్లా అధికారుల ద్వారా మళ్లీ ఫైలును పైకి పంపేందుకు ఎత్తుగడ వేస్తోంది.

రూ.814 కోట్ల ఆదాయం వచ్చేది.. 233 కోట్లకే కట్టబెట్టేసి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనుల శాఖకు చిన్న తరహా ఖనిజాల ద్వారా వచ్చే సీనరేజీ ఆదాయం రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి సమకూరడం లేదు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాయి కొండలు, గ్రావెల్, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడివస్తోంది. వీటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా సీనరేజీతో పాటు రకరకాల ఫీజుల ఆదాయం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు వచ్చేది. అయితే చిన్న ఖనిజాలకు సంబంధించి సీనరేజీ రాబడి ఇంకా వచ్చే అవకాశం ఉన్నా గనుల శాఖ పెద్దగా దృష్టి సారించేది కాదు. కేవలం ఎంత ఆదాయం వస్తే అంత అన్నరీతిలో వ్యవహరించేది. సరిగ్గా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపై కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. దీని వెనుక భారీ తతంగం నడిపారు. టెండర్ల జారీ దగ్గర నుంచి దా ఖలు వరకు మూడో కంటికి తెలియకుండా అంతా రహ స్యంగా నడిపారు. దీంతో ప్రభుత్వ పెద్దలు తాము అను కున్న కంపెనీకే ఈ కాంట్రాక్టు కట్టబెట్టారు. గనుల శాఖ ను పూర్తిగా డమ్మీగా మార్చేసి సీనరేజీ వసూలు బాధ్యత నుంచి తప్పించేసి పెత్తనమంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టేశారు. గనుల శాఖతో సంబంధం లేకుండా ఈ కంపెనీకి సర్వాధికారాలు ఇచ్చేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు కాంట్రాక్టు కట్టబెట్టేశారు. రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తే చాలని కాంట్రాక్టులో పేర్కొన్నారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్లు చొప్పున 24 వాయి దాల్లో చెల్లించొచ్చని వెసులుబాటు ఇచ్చేశారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు సదరు కంపెనీ నుంచి భారీగా పిండేశారు. ఇంకేం ప్రభుత్వం అండదండలు ఉండడంతో సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలున్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించేసింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. రాజ మహేంద్రవరం ఆటోనగర్, ధవళేశ్వరం బ్యారేజీపై కూడా తాత్కాలిక చెక్ పోస్టులు పెట్టేశారు. రాత్రీ పగలూ తేడా లేకుండా ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వుకున్నా ముక్కు పిండి సీనరేజీ వసూలు చేసేవారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్ల రాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా ముక్కు పిండి నెల నెలా కోట్లలో డబ్బులు పిండేసింది. తెర వెనుక కాకినాడ జిల్లాకు చెందిన ఓ కీలక వైసీపీ నేత సహకారం ఉండడంతో గనులశాఖ సైతం కళ్లుమూసే సుకుంది.సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ. 9.70కోట్ల కంటే అంతకుమించి రెట్టింపు ఆదాయం పిండేసింది. ఒకరకంగా చెప్పాలంటే సీనరేజీ కాంట్రాక్టు ఈ కంపెనీకి కాసుల పంట పండించింది.

అధికారులేమో బాకీ డబ్బుల కోసం ఆ కంపెనీపై ఒత్తిడి తేకుండా సహకరిస్తుండడం విశేషం.

గడువు ముగిసిన రోజే నోటిఫికేషన్

ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9 : జిల్లాలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను 2024-25 సంవత్సరానికి పునరుద్ధీకరణ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రాజమహేంద్రవరం జిల్లా ఐడీ కళాశాల అధికారులు మంగళవారం తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఎయిడెడ్ ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులు తమ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీలోపు సంబంధిత ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరడం గమనార్హం. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఎయిడెడ్ ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో 2024 మార్చి 31వ తేదీ నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తులు, దస్త్రాలను ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారు 11వ తేదీన జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాలని, అనంతరం 15వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లో సెలక్షన్ కమిటీ వారి సమక్షంలో ఒప్పంద అధ్యాపకులు రెన్యువల్‌కు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

రోజుకు ఒక్కొక్కరికీ 20 టన్నుల ఇసుక



రాజమహేంద్రవరం రూరల్ జూలై 9 : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారులకు ఇసుక పంపిణీ చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. రూరల్ మండలం పరిధిలో కాతేరు ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆర్డీవో చైత్రవర్షిణి, ఇతర అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కాతేరు ఇసుక పాయింట్ వద్ద సుమారు 7 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక పంపిణీ విషయంలో నియయ నిబంధనలు అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ఇంటి ప్లాన్ ప్రకారం అవసరమైన మేరకు మాత్రమే ఇసుక విడుదల చేయాలన్నారు. గరిష్ఠంగా 20 మెట్రిక్ టన్నుల వరకూ మాత్రమే ఒక వ్యక్తికి ఒక రోజులో సరఫరా చేయడానికి ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహశీల్దార్ వైవీకే.అప్పారావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

గోకవరం, జూలై 9 : మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఇసుకను ఉచితంగా అందజేసి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకుందని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఆచంట రాజు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని హర్షిస్తూ గోకవరంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు ఆనందోత్సవ ర్యాలీ చేశారు. ముందుగా భవన నిర్మాణ కార్మికులు దేవిచౌక్ సెంటర్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి, సీఎం చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం అక్కడ నుంచి పాత బస్టాండ్ మీదుగా పంచాయతీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు

రాజమహేంద్రిని సుందరీకరిస్తాం

- దీర్ఘకాలిక ప్రణాళికతో ఓ మాస్టర్‌ప్లాన్
- మూడు నెలల్లో కార్యాచరణ - పుష్కరాలకు మార్పు
- గోదావరిలో 3 గంటలు బోట్‌పై పరిశీలన
- మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, జూలై9(ఆంధ్రజ్యోతి) : వచ్చే 2027 పుష్కరాల నాటికి గోదావరి రివర్ ఫ్రంట్ సుందరీకరణతో పాటు రాజమహేంద్రవరం నగరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కార్పొరేషన్, టూరిజం శాఖ అధికారులతో కలిసి మంగళవారం గోదావరిలో బోట్‌మీద పుష్కరఘాట్, కోటిలింగాలరేవు, సరస్వతిఘాట్, హేవలాక్ బ్రిడ్జి, గోదావరి రైల్వే వంతెనలు, రివర్ ఫ్రంట్ భాగం, గోదావరి లంకలు పరిశీలించారు. ఉదయం నుంచి సుమారు 3 గంటల సమయం వీరు గోదావరిలో బోటులోనే ఉన్నారు. టూరిజం అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యాటక ప్రాధాన్యత వివరించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం నగరానికి పర్యాటక ప్రాంతంగా అంతర్జాతీ స్థాయి గుర్తింపు వచ్చేలా ఇప్పటి నుంచే ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. రానున్న మూడు నెలల్లో కార్యాచరణ చేపడతామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ 2027 నాటి పుష్కరాలను దృష్టిలో ఉంచుకునే స్వయంగా బోటులో ప్రాంతాలను పరిశీలించామన్నారు. వచ్చే పుష్కరాలకు భక్తుల తాకిడి ఎక్కువ స్థాయిలో ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ఓ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి నివేదిక సిద్ధం చేసిన తర్వాత నిధులకు ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గత మూడు పుష్కరాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతాన్ని, ఘాట్లను అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు మరో అవకాశం వచ్చిందన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మూడునెలల్లో ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రివర్ లోయర్ ఫ్రంట్‌కు సంబంధించి ఇప్పటికే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. వారి వెంట కమిషనర్,ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, టూరిజం జాయింట్ డైరెక్టర్ వి.స్వామినాయుడు,ఎస్‌ఈ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల పనైపోతోంది!



రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో సా..గుతున్న పనులు

- స్టేషన్‌లో ఎడాపెడా పనులు..
- ప్రయాణికులకు ఇక్కట్లు
- 3 ప్లాట్‌ఫాంలపైనా ఇబ్బందులే
- పట్టించుకోని రైల్వే అధికారులు

రాజమహేంద్రవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో వింత పరిస్థితి నడుస్తోంది. అధికశాతం రైళ్లను నిలిపే మూడు ప్లాట్‌ఫాంలపై కూడా ఏదొక మరమ్మతుల పని జరుగుతూనే ఉంది. దీంతో రైలు ఎక్కి, దిగే హడావుడిలో ఎవరు ఏ ప్రమాదానికి గురవుతారోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రయాణికుల భద్రత రీత్యా పనులు చేస్తుండడం హర్షించదగిన విషయమే అయినా శాఖల నడుమ సమన్వయం కోల్పోవడం బాధాకరంగా ఉంది. దీంతో రద్దీ సమయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో మే 5న రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌పై గూడ్స్ రైలు పట్టాలు తప్పడంలో ఒక్కసారిగా అధికారులకు మరమ్మతులు గుర్తొచ్చాయి. అప్పటి వరకూ వదిలేసి రైలు పట్టాలు తప్పిన తర్వాత అన్ని విభాగాలూ మూకుమ్మడిగా పనులు ఆరంభించడంతో ఇబ్బందులకు అవకాశం ఇచ్చినట్లయింది. ఈ స్టేషను గుండా రోజూ సుమారు 90 వరకూ ప్రయా ణికుల రైళ్లు, 60 గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. దాదాపు 10 వేల మంది ప్రయాణాలు చేస్తారు. నాలుగు జిల్లాల రైలు ప్రయాణికులకు గేట్‌వేగా ఈ స్టేషను ఉంది. అలాంటి స్టేషనులో ఎడాపెడా అన్ని పనులూ ఒకేసారి చేస్తుండడం సమస్యగా మారింది. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ట్రాక్‌పై సోమవారం(8వ తేదీ) నుంచి నెలాఖరు వరకూ రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. రెండో నెంబరు ట్రాక్ పనులను గత నెల 18న పూర్తి చేశారు.కానీ ప్లాట్‌ఫాంపై టైల్సు వేయకపోవడంతో ప్రయాణికుల రైళ్లకు మరికొంత ఆలస్యమైంది.ఇప్పుడు రైళ్లు నడుస్తున్నా ఇంకా సిమెంటు పనులు జరుగుతూనే ఉన్నాయి. ప్లాట్‌ఫాంపై టైల్సు, ఇసుక ఉన్నాయి. ప్రయాణికులు ఇసుకపై నడుస్తూ జారితే ప్రమాదమే. మూడో నెంబరు ప్లాట్‌ఫాంపై మరమ్మతు పనులు చేస్తున్నారు. రైలు ఎక్కడానికి మూడు అడుగుల దూరంలో ఇవి జరుగుతున్నాయి. ఈ మధ్యలో ఆహార పదార్థాలు అమ్మేవారు ట్రేలను పెడుతున్నారు. దీంతో రైలు ఎక్కి, దిగేవారికి ఇబ్బంది అవుతోంది. రాత్రి వేళల్లో రద్దీ అధికంగా ఉండే సమయంలో ఎవరు ప్రమాదానికి గురవుతారో తెలియని పరిస్థితి ఉంది. అసలే 22 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతో ప్రస్తుతం నడుస్తున్న రైళ్లలో జనం కిక్కిరిసి ఉంటున్నారు. ఇక 4,5 ప్లాట్‌ఫాంలు ఉన్నా లేనట్టే. మరమ్మతు పనులు చేస్తున్నా ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే స్టేషనులోని ఒకటో ప్లాట్‌ఫాంకు వెళ్లకుండా రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న మెట్ల మార్గం ద్వారా నేరుగా 2, 3, 4, 5 ప్లాట్‌ఫాంలకు చేరుకొనే వెసులుబాటు ఉంది. కానీ ఇక్కడ టికెట్ బుకింగ్ కౌంటర్ లేదు. దీంతో టికెట్ తీసుకొనేవాళ్లు 1వ ప్లాట్‌ఫాంకు వెళ్లి మెట్ల మార్గం ద్వారా ఇతర ప్లాట్‌ఫాంలకు వెళ్తున్నారు. ఇదీ ఇబ్బందిగానే ఉంది. అందువల్ల ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ట్రాక్‌కి మరమ్మతులు పూర్తయ్యే వరకూ రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న మెట్ల మార్గం ప్రవేశంలో టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేస్తే మరమ్మతులు జరుగుతున్న మొదటి ప్లాట్‌ఫాంపైకి ప్రయాణికులు వెళ్లే సమస్య తగ్గే అవకాశం ఉంది. అలాగే స్టేషను ప్రాంగణంలో, ప్లాట్‌ఫాంలపై ప్రవేశ, నిర్గమ మార్గాలను తెలిపే సూచన బోర్డులు పెడితే మేలుగా ఉంటుంది.

భవన నిర్మాణ కార్మికుల కడుపు నింపేందుకు
ఉచిత ఇసుక విధానం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్


ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ మేరకు ఉచిత ఇసుకను వినియోగదారులకు అందించే కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో ప్రారంభించడం శుభపరిణామమని, గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కడుపుకొడితే కూటమి ప్రభుత్వం కడుపు నింపే విధంగా ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉచిత ఇసుక పాలసీని మంత్రి దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్డీవో చైత్రవర్షిణిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వినియోగదారుడు ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే ఇబ్బందులు పడడం చూశామని, దీంతో కేవలం ట్రాన్స్‌పోర్టేషన్‌కు రుసుము కట్టుకునేలా ఉచితంగా ఇసుక విధానాన్ని తీసుకొచ్చామన్నారు. గతం తాలూక ముసుగు తీసి వేసి ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని, గతంలో తాను కడియపులంకకు వెళ్లి పరిశీలించినప్పుడు అక్కడ అక్రమంగా నదీ గర్భంలోకి వెళ్లి ఇసుకను దోచేసిన సంఘటన వెలుగులోకి తీసుకొచ్చామన్నారు. జేపీ కంపెనీ, మరో కంపెనీలు చేసిన దానిపై సీబీఐ విచారణ జరపాలని కూడా సీఎం చంద్రబాబుకు లేఖ పంపినట్టు గుర్తుచేశారు. ఇసుకను బోట్స్‌మెన్ సొసైటీలను రివైజ్ చేస్తూ దానిని స్టాక్ పాయింట్‌కు తీసుకువచ్చి అక్కడ నుంచి పేదలకు ఉచితంగా అందించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జగన్ అతని ప్రజాప్రతినిధులు విచ్చలవిడిగా ఇసుకను దోచేశారన్నారు. జేపీ ఇచ్చే ఒక వేబిల్లుతో ఎన్నో ట్రిప్పులు వేసేవారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దందాలో ఉన్న ప్రతి ఒక్కరి డేటా తమ వద్ద ఉన్నదని చర్యలు ఉంటాయన్నారు.

ప్రభుత్వానికి లాభాపేక్ష లేకుండా ఉచిత ఇసుక విధానం: కలెక్టర్

పేదలకు ఉచిత ఇసుక పాలసీ ప్రారంభించామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్టాక్ పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆధార్ కార్డు, ఇంటి ప్లాన్ అప్రూవల్ కాపీ తీసుకుని రావాలన్నారు. పాత ఇళ్ల మరమ్మతులు చేయించుకునేవారు పాత ప్లాన్లు తీసుకుని రావాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ డిపార్టుమెంట్ల సమన్వయంతో ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలి పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద విజిలెన్స్ ఉంటుందన్నారు. ఇతర జిల్లాలకు ఇసుక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా విశాఖ జిల్లాకు ఇవ్వాల్సి ఉంటుందని అటువంటి వాటికి కలెక్టర్ రిక్వస్ట్ ద్వారా ఇవ్వాల్సి ఉందన్నారు.. బోట్స్‌మెన్ సొసైటీల డిసిటేషన్‌కు సంబంధించి ధవళేశ్వరం సీఈ చూస్తున్నారన్నారు. స్టాక్ పాయింట్‌లో డిప్యూటీ తహశీల్దార్లను పెడుతున్నామన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1800 4252540కు ఫోను చేయాలని చెప్పారు. ప్రజలు తమకు నచ్చిన వాహనాల్లో వచ్చి లోడింగ్ చార్జీలు చెల్లించి నేరుగా ఇసుకను తీసుకువెళ్లవచ్చని తెలిపారు. జిల్లాలో 7 ఇసుక స్టాక్ పాయింట్‌లు ఉన్నాయని, వాటిలో చిడిపి స్టాక్ యార్డ్ వద్ద 36,051 టన్నులు, పందలపర్రు స్టాక్ పాయింట్‌లో 52,082 టన్నులు, పెండ్యాలలో 1,46,259 టన్నులు, ఉసులుమర్రులో 33,065 టన్నులు, కాతేరులో స్టాక్ యార్డ్‌లో 6,939 టన్నులు, లాలాచెరువు వద్ద 7,403 టన్నులు, బుర్రిలంక స్టాక్ పాయింట్ వద్ద 20,862 టన్నులు ఇసుక ఉందని తెలిపారు. టన్ను ఇసుక ధర రూ.270గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నూతన ఇసుక విధానంలో దుర్వినియోగం చేస్తే సహించేదిలేదని, ఇసుక బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ సుబ్రహ్మణ్యం, ఆర్డీవో శ్రీదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, నక్కా దేవివరప్రసాద్, కోసూరి చండీప్రియ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 9: ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ లకోసం ఈనెల 1న ప్రారంభమైన ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ మంగళవారం కూడా కొనసాగింది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 7తో ముగిసింది. ధ్రువపత్రాల పరిశీలన 4న మొదలు కాగా ఇప్పటి వరకూ కాకినాడ జేఎన్టీయూకే సహాయ కేంద్రంలో 4200 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలించినట్లు హెల్ప్‌లైన్ సెంటర్ సమన్వయకర్త ప్రొఫెసర్ ఎస్.బాలాజీ తెలిపారు. అంతే కాకుండా వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈనెల 12 వరకూ కొనసాగుతుందని, 13న ఆప్షన్లను మార్పు చేసుకోవచ్చని, 16న సీట్ల కేటాయింపు జరుగుతుందని 17 నుంచి 22లోపు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఈనెల 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే వర్సిటీలోని యూసీఈకేలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. అంతే కాకుండా 79956 81678, 79958 65456, 91779 27677 హెల్ప్‌డెస్క్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చని బాలాజీ తెలిపారు.

ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా
విద్యుత్ బిల్లుల చెల్లింపులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిలులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించకపోతే గనుక వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని గాని, సంస్థ వెబ్‌సైట్ నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ గాని వెబ్‌సైట్ ద్వారా గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సీఎండీ చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా
బ్యాగులు, పుస్తకాలు

తొండంగి,జూలై 9: ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా బ్యాగులు, నోటు పుస్తకాలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కస్తూర్బా విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులతో పాటు హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు బ్యాగులతో పాటు 6 వైట్, 6 రూళ్ల లాంగ్ నోటు పుస్తకాలు అందిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 17964 మంది విద్యార్థులకు వీటిని అందించనున్నారు. ఇప్పటికే వీటిని మండల కేంద్రాలకు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 4026 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3802 మంది ఉండగా కోనసీమ జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 1790 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 1763 మంది, తూర్పుగోదావరి జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 3326 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3257 మంది ఉన్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 9142 మంది, ద్వితీయ సంవత్సరం 8822 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు.

సమగ్ర శిక్షా సిబ్బంది జీతాల బకాయిలు విడుదల చేయాలి

అమలాపురం టౌన్, జూలై 9: పాఠశాల విద్యా శాఖలోని సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులకు బకాయిపడ్డ జీతాలను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కేఎస్ లక్ష్మణరావు మంగళవారం ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర ఉన్నతాధికారులకు, మంత్రికి లేఖలు పంపించారు. మే, జూన్ నెల జీతాలను చెల్లించాల్సి ఉందని, జీతాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి చిరుద్యోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీతాల బకాయిలతో పాటు గత ఏడాది డిసెంబరు 19 నుంచి జనవరి 9 వరకు 22 రోజుల పాటు సమగ్ర శిక్షా సిబ్బంది డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేశారు. సమగ్ర శిక్షా సిబ్బంది అప్పటి జేఏసీ నాయకులతో చర్చించగా సమ్మె కాలపు జీతాలు చెల్లించేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఇంతవరకు ఆ బకాయిలను విడుదల చేయలేదని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు సమగ్ర శిక్షా ఉన్నతాధికారులకు, ఆర్థికశాఖ కార్యదర్శికి వినతిపత్రాలు పంపించారు. సమగ్ర శిక్షా అధీనంలో మండల విద్యా శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల అకౌంటెంట్లు, ఆఫీసు అసిస్టెంట్, సీఆర్‌ఎంటీలు, ఐఈఆర్టీలు, ఆయా, పీటీఐలు జీతాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుని ఆయా కుటుంబాలు అప్పుల బారిన పడకుండా జీతాల బకాయిలు విడుదల చేయాలని ఎమ్మెల్సీ ఐవీ కోరారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

కోరుకొండ, జూలై 9: రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులు, పురుగుమందుల షాపులు తనిఖీల్లో భాగంగా కోరుకొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కోరుకొండకు చెందిన గ్రోమోర్ ఎరువుల షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉండాల్సిన బరువు కంటే తక్కువ బరువు కలిగి ఉన్నారన్న కారణంగా రూ.1.36 లక్షలు విలువైన 177 బస్తాల ఎరువులను సీజ్ చేసినట్లు విశాఖపట్నానికి చెందిన అత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.మోహన్‌రావు తెలిపారు. అదే విధంగా హరి ఎరువుల షాపును తనిఖీ చేయగా అక్కడ ఒక రకం పురుగుల మందు శాంపిల్ తీయని కారణంగా ఈ మందు అమ్మకాన్ని నిలుపుదల చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత నాలుగు రోజులు తూర్పుగోదావరిలో ఎరువులు, పురుగుల మందుల తయారీ సంస్థలు, షాపులు, గోదాములు తనిఖీ చేశామన్నారు. రిటైల్, హోల్‌సేల్‌కు సంబంధించి 25 షాపులు తనిఖీ చేశామన్నారు. సుమారు రూ.66 లక్షలు విలువ గల ఎరువులు, పురుగుమందులను సీజ్ చేయడం, నిలుపుదల చేయడం చేశామన్నారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, అగ్రికల్చరల్ ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవి పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారు వట్టి ప్రగల్భాలే..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కాకినాడ సిటీ, జులై 9: పేరుకు తప్ప డబుల్ ఇంజన్ సర్కారుతో ఈ రాష్ట్రానికి ఒరిగేదేమీలేదని కాకినాడ సూర్యకళా మందిరంలో మూడు రోజులపాటు జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు రెండో రోజు మంగళవారం కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాజమహేంద్రవరంలో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర సదస్సులో చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏర్పడిన డబుల్ ఇంజిన్ సర్కార్ అప్పుడు కూడా ఏమీ చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఏదో చేస్తామని ప్రగల్భాలు పలకడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం మాటల గారడీ మాని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలన్నారు. రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు దాటిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో దూసుకుపోతోందన్నారు. తెలంగాణ ఐటీ ద్వారా 80 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతుంటే ఆంధ్రలో 3.6 శాతం మాత్రమే సపోర్ట్ ఉంటోందని వివరించారు. విభజన హామీలు నెరవేర్చాలన్నా, ఆంధ్ర ప్రదేశ్ ఐటీ రంగంలో, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందాలన్నా ప్రత్యేక హోదా తోనే సాధ్య మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం నిలబడాలని, అఖిల పక్షం ఏర్పాటు చేయాలని రామకృష్ణ సూచించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజకీయాల్లోకి రావాలని, తద్వారా సమాజంలో అవినీతిలేని రాజ కీయాలు చేయాలని రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా భారతదేశ చరిత్ర సంస్కృతి, వక్రీకరణ అనే అంశంపై ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు డి.సోమసుందర్, నేటి రాజకీయాలు- ప్రత్యామ్నాయం అనే అంశంపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు అనే అంశంపై ప్రముఖ వక్త పెన్మెత్స సుబ్బరాజు ప్రసంగించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, టి అన్నవరం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

53 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 9: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బ్యారేజ్ నుంచి 53,464 క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం 9700 క్యూసెక్కులను 3 డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లో 45 గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లో 20 గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 5 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 15 గేట్లను 20 మిల్లీమీటర్ల మేర పైకి ఎత్తి మిగులు జలాలను దిగువకు విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. తూర్పుడెల్టాకు 3600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.

లక్ష్యాలను అధిగమించేలా ఉపాధ్యాయుల శిక్షణ ఉండాలి

టీచ్ టూల్ ప్రాజెక్టు స్టేట్ ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ లక్ష్యాలను అధిగమించేలా ఉండాలని టీచ్ టూల్ ప్రాజెక్టు స్టేట్ ఇన్‌చార్జి డాక్టర్ పి.సతీష్‌రెడ్డి అన్నారు.. టీచ్ టూల్ కార్యక్రమంపై రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్లో 9 రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను మంగళవారం ఆయన రాష్ట్ర పర్యవేక్షక బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధనను మెరుగుపరచడం కోసం, మూల్యాంకనం చేయడం కోసం టీచ్ టూల్ అనే సాధనాన్ని అభివృద్ధి చేసి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ టీచర్, సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రతిఒక్కరు శిక్షణ లక్ష్యాలను బాగా అవగాహన చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు జరిగిన శిక్షణ డాక్యుమెంటేషన్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీమెట్ ప్రొఫెసర్ ఎ.ప్రభాకరరావు, సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్, కోర్స్ డైరెక్టర్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, రిసోర్స్‌పర్సన్స్ ఎన్.శ్రీనివాస్, జె.స్వప్నప్రియ, కె.లక్ష్మణరేఖ, ప్రవీణ్ శిరీష పాల్గొన్నారు.

హోంగార్డులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డిని కలిసి విన్నవించిన పలువురు హోంగార్డులు


మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందిస్తున్న హోంగార్డులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: రాష్ట్రంలో ఉన్న 16 వేల మంది హోంగార్డులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు బాధిత హోంగార్డులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో వారిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. హోంగార్డులను రాష్ట్ర ప్రభుత్వ యూనిఫాం సర్వీసు డిపార్ట్‌మెంట్‌లలో సీనియారిటీ ప్రాతిపాదికన విలీనం చేయాలని, ఇతర శాఖాపరమైన బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. హోంగార్డులకు ఇస్తున్న రోజువారీ వేతనం సరిపోక ఇబ్బందులు పడుతున్నామని గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. హోంగార్డు వ్యవస్థ 1963 నుంచి ఇప్పటివరకు వలంటీర్ వ్యవస్థగానే పరిగణిస్తున్నారని ఏళ్ల తరబడి పోలీసులతో సమానంగా పనిచేస్తున్న తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, టీఏ, డీఏ సదుపాయాలు లేవని, కానిస్టేబుల్‌గా పదోన్నతులు లేవన్నారు. హోంగార్డులుగా చేసి పదవీవిరమణ చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం లభించడంలేదన్నారు. అందువల్ల తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. మంత్రి, ఎమ్మెల్యేలను కలిసిన కె.మురళీ, పి.పాపారావు, ఐ.సతీష్, ఇజ్రాయేలు, బాపిరాజు, లక్ష్మణ్, కామేశ్వర్, గిరి, మూర్తి, సాయి, కాళీ, సూరిబాబు, లలిత, సుజాత, భారతి, సరళ, జాన్సీ, శ్రీదేవి, 20 మంది హోంగార్డులు ఉన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

ఎటపాక,జూలై 9: నాలుగేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారం చేశాడు. అల్లూరి జిల్లా ఎటపాక మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘోరం ఆలస్యంగా వెలుగుచూసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి పదేళ్ల క్రితం బతుకుదెరువుకు ఇక్కడకు వచ్చిన ఆదివాసీ కుటుంబం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వారి ఇంటిలో నాలుగేళ్ల చిన్నారి ఉంటోంది. ఆదివారం అమరవరపు రాము అనే వ్యక్తి చిన్నారి ఇంటికి వెళ్లి చాక్లెట్లు ఇస్తానని చెప్పి అతని ఇంటికి తీసుకెళ్లి అమానుషంగా అత్యాచారం చేశాడు. చిన్నారికి రెండు రోజుల నుంచి నలతగా, జ్వరంగా ఉండడంతో తల్లి అడగడంతో జరిగిన విషయాన్ని బయటపెట్టింది. దీంతో బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీలు

212 గ్రాముల బంగారం రికవరీ


నిందితుడి వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

రాజమహేంద్రవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): తండ్రి బాటలోనే నడిచిన కొడుకు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. చిన్న వయసులో చిన్న దొంగతనాలతో మొదలుపెట్టి క్రమంగా పెద్ద చోరీల వైపు మళ్లాడు. ఓ కేసులో డొంక లాగిన పోలీసులకు చిక్కడంతో కటకటాల్లోకి నెట్టారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతమూరుకు చెందిన కొండేటి సాయి తండ్రి రాంబాబు చోరీలు చేసేవాడు. కరోనాతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో 10వ తరగతి వరకూ చదువుకొన్న సాయి 2017 నుంచే చిన్న చిన్న దొంగతనాలు చేయడానికి అలవాటు పడ్డాడు. మిల్క్ డెయిరీ, ఫ్లిప్‌కార్ట్ తదితర చోట్ల ఉద్యోగం చేశాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడడంతో జీతం సరిపోయేది కాదు. దీంతో మళ్లీ చోరీలవైపు మళ్లాడు. ఈసారి కాస్త పెద్ద దొంగతనాలపై దృష్టి పెట్టాడు. ఇళ్లలో రాత్రి వేళల్లో దొంగతనాలు చేసేవాడు. గత ఏడాది సెప్టెంబరు 22న పాత బొమ్మూరులోని ఓ ఇంట్లో జరిగిన చోరీపై క్రైం నెం.311/2023గా బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి సాయిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామని డీఎస్పీ వివరించారు. అతడి వద్ద నుంచి 212 గ్రాముల బంగారు, 1.5 కిలోల వెండి ఆభరణాలు, రూ.90 వేల నగదు, ఒక మోటార్‌సైకిల్‌ను రికవరీ చేశామన్నారు. రాజానగరం పీఎస్‌లో రెండు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఒక చోరీ కేసు, అంబాజీపేట, సామర్లకోటలో బైండోవర్ కేసులు ఉన్నాయని, గడిచిన ఏడాది కాలంలో ఆరు కేసులు బొమ్మూరు పీఎస్‌లో నమోదయ్యాయని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐలు బి.శ్రీను, ఆర్.అంకారావు, ఏఎస్సై ఏకే సత్యనారాయణ, హెచ్‌సీ పి.వెంకటేశ్వరరావు, పీసీ కె.సురేశ్‌బాబును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం చెక్కు అందిస్తున్న దాతలు

సామర్లకోట జూలై 9: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన యరపోతిన వెంకటరామచౌదరి, ఆశారాణి దంపతులు లక్ష రూపాయల విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ సిబ్బందికి అందజేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం మాట్లాడుతూ భక్తులకు ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం అమలుతీరును పరిశీలించి సంతృప్తి చెందిన అనంతరం వెంకటరామచౌదరి దంపతులు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. దాతలకు స్వామివారి, అమ్మవారి ప్రత్యేక దర్శనాల అనంతరం ప్రసాదాలు చిత్రపటాలను ఆలయ సిబ్బంది అందించారు. వేద పండితులు సోమేశ్వర శర్మ, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ పాల్గొన్నారు.

సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 9: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన డి.వి సీతారామస్వామి లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

కోటనందూరు, జూలై 9: కాకినాడ జిల్లా కోటనందూరులో శ్రీ మహలక్ష్మీ రైస్ మిల్లు నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం... కోటనందూరు పరిసర ప్రాంతాల నుంచి రేషన్‌కార్డుదారుల నుంచి తక్కువ రేటుకు బియ్యం కొనుగోలు చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి అక్రమంగా లారీలో తరలించేందుకు సిద్ధం చేస్తుండగా పట్టుకున్నామని విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో 25,300 కిలోల రేషన్ బియ్యం, నాలుగు ఎలక్ట్రికల్ కాటాలు, 1400 కిలోల ఫోర్టిఫైడ్ రైస్, 12300 కిలోల బియ్యం, 3750 కిలోల ధాన్యం, 1500 కిలోల బ్రోకెన్ బియ్యం, 1050 కిలోల రైస్ బ్రాన్‌ను సీజ్ చేశామన్నారు. రవాణా, అమ్మకం చేస్తున్న పోతల రాంబాబు, శెట్టి శ్రీనివాస్, కోన ప్రభుదాస్, మోహన్‌లాల్‌యాదవ్, అనంద్‌దేవాంగన్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏవో భార్గవమహేష్, డీసీటీవో నవీన్‌కుమార్, లోవరాజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకాలువలో గుర్తు తెలియని మృతదేహం

అనపర్తి, జులై 9 : అనపర్తి శివారు కొత్తూరు వద్ద ఎర్రకాలువలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్ఐ హనుమంతరావు మాట్లాడుతూ సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుని మృతదేహాన్ని గుర్తించామని శరీరంపై స్కైబ్లూ కలర్ పొడవు చేతుల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉందని సుమారుగా 5.6 ఎత్తు ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. చనిపోయి రెండు రోజుల పైబడి కావచ్చని మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉందని దుస్తుల ఆధారంగా వివరాలు తెలిసిన వారు అనపర్తి పోలీసులను సంప్రదించాలని అన్నారు, వీఆర్వో కోసూరి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు తెలిపారు.

మహిళా సంఘాల పేరుతో రుణాలు స్వాహా

పిఠాపురం పట్టణానికి చెందిన యానిమేటర్ నిర్వాకం


విచారణ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

పిఠాపురం రూరల్, జూలై 9: మహిళా సంఘాల పేరుపై రుణాలు తీసుకుని వాటిని స్వాహా చేసిన యానిమేటర్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలో 58 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటికి పిఠాపురం పట్టణానికి చెందిన దారా పద్మకుమారి యానిమేటర్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళలను వివిధ సంఘాల్లో సభ్యులుగా చేర్చి బ్యాంకు ఆఫ్ బరోడా, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సహా ఇతర బ్యాంకులు నుంచి రుణాలు ఇప్పించేది. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల వారిని సభ్యులుగా చేర్చి యానిమేటర్ లక్షలాది రూపాయలను తమ పేరుపై రుణాలు తీసుకుని పక్కదోవ పట్టించిందని, 2019 నుంచి 2022 వరకూ ఈ వ్యవహారం జరిగిందని పలు మహిళా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టరు షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్డీఏ అధికారులు విచారణ చేపట్టారు. తాము రుణాలు తీసుకోకుండా అప్పులు చెల్లించాలని బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు తమపై ఒత్తిడి తేవడంతో విషయం తెలిసిందని మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. తాము తీసుకోని రుణాలకు ఎలా చెల్లిస్తామని తాము ప్రశ్నించి ఫిర్యాదు చేశామని చెప్పారు. వెలుగు ఏపీఎం ప్రియదర్శిని మంగళవారం 30 గ్రూపులను విచారించగా 15 గ్రూప్‌ల సభ్యులు తాము రుణాలు తీసుకున్నట్లు తెలపగా మిగిలిన వారు తీసుకోలేదని చెప్పారు. ఈ గ్రూపుల పేరు మీద రూ.60లక్షలు అక్రమంగా యానిమేటర్ రుణాలు పొందినట్లు గుర్తించారు. అదే విధంగా బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజర్ యానిమేటర్ పద్మకుమారి నుంచి రూ.50 లక్షల వరకూ రికవరీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతున్నదని, పూర్తయితే ఎంత మేర రుణాలు అక్రమంగా పొందారో, ఎంత మేర దుర్వినియోగానికి పాల్పడ్డారో తేలుతుందని చెప్పారు.

నేడు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

కోరుకొండ, జూలై9: రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన అన్నిప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ప్రతి గ్రామ ంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం బుధవారం ఉదయం 10.30కు జరుగుతుందని ప్రతి గ్రామంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, పాల్గొని కిట్స్ పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఏజెన్సీ సమాచారం



తంటికొండ గ్రామంలో నిలిచిపోయిన వాహనాలు

నీట మునిగిన తంటికొండ

- జాతీయ రహదారి నిర్మాణంలో అసంపూర్తి పనుల వల్లే ముంపు
- హైవేపై వాహనాలు నిలిపివేసిన గ్రామస్థులు



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నాయకులు

రాజవొమ్మంగి, జూలై 9: ఏజెన్సీలో సోమవారం రాత్రి నుంచి కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు గ్రామాలు జలమయమయ్యాయి. రాజవొమ్మంగి మండలంలోని తంటికొండ గ్రామంలో వరదనీరు ఇళ్లలోకి వెళ్లి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తమ గ్రామం నుంచి బయటకు వెళ్లే వరదనీటికి సరైన మార్గం చూపకపోవడంవల్ల గత రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారు ఆందోళన బాట పట్టారు. సంబంధిత అధికారులు సరైన సమాధానం చెప్పట్లేదంటూ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. సుమారు గంటసేపు వాహన రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. జడ్పీటీసీ వడుగుల జ్యోతి, టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామ చంద్రరాజు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు సంఘటనా స్థలానికి వెళ్లి గ్రామస్థులకు నచ్చజెప్పడంతో వాహన రాకపోకలకు గ్రామస్థులు దారిచ్చారు. జాతీయ రహదారి నిర్మాణ అధి కారులతో నాయకులు మాట్లాడుతూ గత ఏడాది ఇలాంటి పరిస్థితే గ్రామానికి ఏర్పడిందన్నారు. ప్రతిసారీ ప్రజలు నష్టపోయిన తర్వాతే జాతీయ రహదారి నిర్మాణ అధికారులు వచ్చి మాటలుచెప్పి వెళ్లిపోతారని అసహనం వ్యక్తం చే శారు. ఇటువంటి సంఘటన పునరావృత్తం కాకుండా చూసుకుంటామని జా తీయ రహదారి నిర్మాణ అధికారులు నాయకులకు, గ్రామస్థులకు హామీ ఇచ్చా రు. నీరు రోడ్డుకు అటువైపునకు వెళ్లేందుకు ఇప్పటికే ఒక తూర ఉండగా మరో రెండు తూరలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. రాజవొమ్మంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకయ్య పరిస్థితిని అదుపు చేశారు.

సర్వే ఉద్యోగుల వితరణ



వృద్ధులకు చేయూతనిస్తున్న రెవెన్యూ సర్వే ఉద్యోగులు

వై.రామవరం, జూలై 9: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో రెవెన్యూ సర్వే ఉద్యోగులు నిస్సహాయక స్థితిలో ఉన్న గిరిజన వృద్ధులకు, దివ్యాంగులకు చేయూతనిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏపీ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అల్లూరి జిల్లా సభ్యుడు జి.విజయశంకర్ ఆధ్వర్యంలో మండలంలోని జాజిగడ్డ, చింతకర్రపాలెం గ్రామాల్లో పలువురు వృద్ధులు, దివ్యాంగులను గుర్తించి ఒక్కొక్కరికీ ఐదు కేజీల రైసు బ్యాగు, కూరగాయలు, రూ.500 నగదును అందజేశారు. కార్యక్రమంలో పలువురు సర్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి

- రూ.50 వేలు ఆస్తినష్టం



పొలంలో మృతి చెందిన దుక్కిటెద్దు

ఎటపాక, జూలై 9: పిడుగుపడి దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మంగళ వారం ఎటపాక మండలం, పురుషోత్తపట్నం గ్రామంలో జరిగింది. దామెర్ల రామ్మకృష్ణకు చెందిన దుక్కిటెద్దు మధ్యాహ్న సమయంలో గ్రామ శివారు ప్రాంతంలోని పొలాల్లోకి మేత కోసం వెళ్లింది. పొలంలో మేత తింటుండగా ఒక్కసారిగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని యాజమాని తెలిపారు.

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



ఊడిపడిన శ్లాబు పెచ్చులు

కూనవరం, జూలై 9: మండలంలోని బండారుగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు త్రుటిలో ప్ర మాదం తప్పింది. ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు క ట్టం కుమారి విద్యార్థులకు పాఠా లు బోధిస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. విద్యార్థుల పక్కనే పాఠశాల శ్లాబు పైపెచ్చులు ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో విద్యార్థులు పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు. ఒక్కసారిగా పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు పరుగులు తీశారు. దీంతో చివరకు ఉపాధ్యాయురాలు రోజంతా పాఠశాల బయటే విద్యను బోధించాల్సి వచ్చింది.

ఉపాధి పనులపై ప్రజావేదిక

అడ్డతీగల, జూలై 9: జాతీయ ఉపాధి హామీ పథకంలో మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించింది. పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించి మంగళవారం అడ్డతీగల స్థానిక కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.శివయ్య, అదనపు జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటేశ్వరరావు, ఎస్ఆర్పీ సీహెచ్ రాజు, ఎంపీడీవో రంగారావు, ఏపీవోలు అరవాలు మణికుమారి, చిరంజీవిబాబు పాల్గొన్నారు.

ఆసుపత్రిని నిర్మించారు... మౌలిక వసతులు మరిచారు

- కనీసం మంచినీటి సౌకర్యం లేని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం
- పీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



రామవరంలో పీహెచ్‌సీని సందర్శించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 9: ఆసుపత్రి నిర్మాణం చేయగానే సరికాదని అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేని నిర్మా ణాలు ఎందుకని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భవన నిర్మాణాలను పరిశీలించి ఆసుపత్రిలో ఉన్న సమస్యలను వైద్యు లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కనీసం మంచినీటి సౌక ర్యం లేకపోవడంచూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పీహెచ్‌సీ భవనాన్ని ఆర్భాటంగా నిర్మిం చిందని కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదన్నారు. గదులను ఇరుకుగా నిర్మించారని కనీసం మందుల నిల్వ చేసేందుకు ప్రత్యేకగది కూడా లేదన్నారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి హయాంలో నిర్మి ంచిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంపై గత పాలకులు అసత్య ఆరోపణలు చేశారన్నారు. వైద్యుడిగా ఉన్న ఎమ్మెల్యే ఆసుపత్రి నిర్మాణంపై పెట్టిన దృష్టి ఇదేనా అంటూ ఆయన ప్రశ్నించారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారని త్వరలో ఆసుపత్రికి అవసరమైన సదుపాయాల కల్పనకు తక్షణ మంచినీటి సౌకర్యం ఏర్పాటుపై తక్షణ చర్యలు చేపడతామన్నారు. త్వరలోనే గ్రామంలో హోమియో వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడతా మన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట ఎన్డీయే నాయకులు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, గొలు గూరి వీర్రాఘవరెడ్డి ఉన్నారు.

నీట మునిగిన 200 ఎకరాల పంట భూములు

- ఎమ్మెల్యే నల్లమిల్లి చొరవతో గుర్రపుడెక్క తొలగింపు

అనపర్తి, జూలై 9 : గత ప్రభుత్వం నిర్లక్ష్యం నేడు రైతన్నలకు శాపంగా మారింది. ఐదేళ్లుగా కాలువలను పట్టించుకోకపోవడంతో నేడు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాలువల్లో గుర్రపుడెక్క పూడుకుపోవడంతో సాగునీరు పారక శివారు భూ ములకు నీరందక, ముందున్న భూములు నీట మునగడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. కాకినాడ కాలువల్లో భారీ ఎత్తున గుర్రపుడెక్క పూడుకుపోవడంతో సాగునీరు పారక నీరు కాలువగట్టుపై నుంచి పొంగి పొర్లడంతో అనపర్తిలోని భట్టువారి రావిచెట్టు సమీపంలో వందలాది ఎకరాలు నీటమునిగాయి. ఇదే కాలువపై ఉన్న పెదపూడి మండలంలోని అనేక భూములకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఎన్డీయే కూటమి అధికారం చేపట్టిన వెంటనే కాలువల పరిస్థితిని గమనించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గుర్రపుడెక్కను తొలగించేందుకు ఉపాధిహామీ కూలీలను రంగంలోకి దింపి కొద్దిమేర వారితో గుర్రపుడెక్కను తొలగించారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో గోదావరి డెల్టా కాలువల్లో పూడుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు రూ.20కోట్ల నిధులను మంజూరు చేశారు. గత రెండు రోజులుగా జేసీబీ సహాయంతో గుర్రపుడెక్కను తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు. గుర్రపుడెక్క తొలగింపునకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే నల్లమిల్లికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. వారం రోజుల్లో గుర్రపుడెక్క తొలగింపు కొలిక్కివచ్చే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే నల్లమిల్లి రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

పార్టీలకతీకంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట, జూలై 9: మండలంలో గల గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీకంగా అందరి నాయకులను సమన్వయం చేసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలలోనూ గ్రామాల్లో ఏవిధమైన అభివృద్ధి జరగలేదన్నారు. గత ఐదు సంవత్సరాలు పని చేసిన ప్రభుత్వం కేంద్రప్రభుత్వం నిధులతోనే పనిచేసిందిగాని, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనిచేయలేదన్నారు. మండలంలో గల సమస్యలపై చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంగంపేట జడ్పీటీసీ సభ్యులు పేపకాయల రాంబాబు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జడ్పీకోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో పి.వెంకటరత్నం, తహశీల్దార్ లతీఫ్ పాషా, డ్వామా పీడీ, మండల శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రంగంపేట మండల ఎంపీడీవోగా పనిచేసి జూన్ 30న పదవీ విరమణ చేసిన బి.శ్రీరామరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, బిజేపీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం, జనసేన మండల అధ్యక్షుడు సత్తిబాబు, ఎన్డీయే నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఎంపీడీవో శ్రీరామరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కొత్తగా 3 జూనియర్ కళాశాలలు

- కోరుకొండలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదన



విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష

కోరుకొండ, జూలై 9: రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండలో కొత్తగా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రాజానగరం, దివాన్‌చెరువు, గాదరాడ గ్రామాల్లో 3 జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో ఇంటర్మీడియట్ ఆర్జేడీ శారదాదేవి, డీవీఈవో సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఇన్‌చార్జ్ నరసింహం, డీఈవో వాసుదేవరావు తదితర విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యేసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలు, డిగ్రీకళాశాల ఏర్పాటు ప్రతిపాదన వివరాలను అధికారులు ఎమ్మెల్యే బలరామకృష్ణకు వివరించారు. విద్యార్థుల సంఖ్యపెంచాలని కోరుకొండలో కొత్తగా డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని హైస్కూల్ ప్లస్ కో ఎడ్యుకేషన్‌గా మార్చాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

పలు ప్రజా సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యే

కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. పలు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. మరికొన్ని ప్రజా సమస్యలను పరిష్కరించారు. ముఖ్యంగా నీటి పారుదలకు సంబంధించి పలువురు రైతులు, పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందించి 24గంటల్లో వృథాగా పోతున్న తాగునీటిని అరికట్టేందుకు సంబంధిత తూరలు మూసివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బుచ్చింపేట, కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల నుంచి పలువురు రైతులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు తెలిపారు. కోరుకొండ మండలానికి చెందిన పలువురు బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు ఎమ్మెల్యేను కలిసి అభినందనలు, అశీర్వచనాలు అందజేశారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన మురళీమోహన్



ఎంపీ పురందేశ్వరిని అభినందిస్తున్న సినీ నటుడు మురళీమోహన్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9: రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని మాజీ ఎంపీ, సినీ నటుడు మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మురళీమోహన్ మంగళవారం ఎంపీని ఆమె నివాసంలో కలుసుకుని రాజమండ్రి ఎంపీగా ఘన విజయం సాధించడం పట్ల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, టీడీపీ నాయకుడు కాశి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11న అనపర్తిలో చెస్ పోటీలు

అనపర్తి, జూలై 9: ఈనెల 11వ తేదీన అనపర్తిలో అండర్ 10, అండర్ 15 బాలబాలికల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్ఈఎస్ఎస్‌కో ట్రస్ట్ అధ్యక్షుడు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి మంగళవారం అనపర్తిలో విలేకరులకు తెలిపారు. 11నగురువారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీలలో అండర్10, అండర్15 బాలబాలికలు పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతులతోపాటు ప్రసంశా పత్రాలను అందజేస్తావన్నారు. ఈ పోటీలను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిప్రారంభించనున్నట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆశక్తి ఉన్నవారు 81794 60178, 98850 82859లో సంప్రదించాలని ఆయన కోరారు.

క్వారీ గోతుల సమస్యపై మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న క్వారీ గోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రమాదకరంగా మారిన క్వారీ గోతుల్లో నీరు తోడించి, వాటిని క్వారీ యజమానులు వెంటనే పూడ్చించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సున్నం బట్టీ లే అవుట్ కమిటీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, బాబూరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గోరంట్లను కలిసి అభినందిస్తున్న నర్సరీ సంఘం సభ్యులు

ఎమ్మెల్యే గోరంట్లను కలిసిన నర్సరీ సంఘం

కడియం, జూలై 9: సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీ సంఘం మంగళవారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలిశారు. నర్సరీ రైతుల సమస్యలపై ఎమ్మెల్యే గోరంట్లకు వినతిపత్రం అందజేశారు. కడియపులంక నుంచి దోసాలమ్మకాలనీ వరకు రహదారిని అభివృద్ధి చేయించాలని, నర్సరీ రైతులకు పాలీ హౌస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఇప్పించాలని, ధవళేశ్వరం నుంచి బడుగువానిలంక వరకు ఉన్న ఏటిగట్టు రోడ్డు గుంతలు పడి ఉందని దానికి మరమ్మతులు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే గోరంట్ల సానుకూలగా స్పందించి నర్సరీ రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సరీసంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, బోడపాటి గోపి, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తాడాల బాలమురళి, గరగ నాగేశ్వరరావు, తాడాల నాగేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్, వడ్లమూరి రాజేష్ ఉన్నారు.

ఆహార భద్రతపై అవగాహన పెంచుకోవాలి

- నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, జూలై 9: ఆహారభద్రతపై అవగాహన పెంచుకోవాలని, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం-1 ఆధ్వర్యంలో ఆహారభద్రతపై అవగాహన-అతిసారను ఆపండి 2024 కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ అతిసార నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గైట్ కళాశాల ఆచార్యులు కె.మనోహర్‌బాబు మాట్లాడుతూ అతిసార నివారణ, జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులు వాటి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కార్యక్రమ సమన్వయకర్త శీలం రాజ్యలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్. పీవోలు కె.సుజాత, ఎం.గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

బొమ్మూరులో పారిశుధ్య డ్రైవ్



బొమ్మూరు హైవే వద్ద పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, జూలై 9: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో రాఘవేంద్రనగర్, జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రధాన డ్రెయిన్ పూడుకుపోయి, ఈ ప్రాంతంలో ఏపుగా పెరిగిన తుప్పలను మంగళవారం ఎక్స్‌కవే టర్‌తో తొలగించారు. పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చెత్తతొలగింపు పనులు చేశారు. రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్ష్యుడు మత్యేటి ప్రసాద్, కామిని ప్రసాద్, భీమరశెట్టి రమేష్, కామిని భాస్కరరావు, పలివెల సత్యన్నారాయణ, అంగర కృష్ణ, రాయుడు అలేఖ్య పాల్గొన్నారు.

నాటక పోటీలకు రావాలని మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం



మంత్రి కందుల దుర్గేష్ ను ఆహ్వానించిన అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ సభ్యులు

రాజమహేంద్రవరంకల్చరల్, జూలై 9: కాకినాడలో అల్లూరి సీతారామ రాజు నాటక కళాపరిషత్తు ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి 14వరకు కాకినాడ సూర్య కళామందిర్‌లో జరిగే రాష్ట్రస్థాయి నాటక పోటీలను ప్రారంభించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌ను ఆహ్వానించారు. ఆహ్వానపత్రికను సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు, స్థానిక అల్లూరి సీతారామరాజు యువజన బృందం మంత్రి నివాసంలో అందించారు. కార్యక్రమంలో కళావేదిక ఉపాధ్యక్షుడు ఎస్‌వీఆర్ బాపిరాజు, టీవీఎస్ఎన్ రెడ్డి, పంపన మురళి పాల్గొన్నారు.

స్వచ్ఛ పక్వాడా



పాఠశాలకు శానిటేషన్ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు చెందిన లాలాచెరువు ఉన్నత పాఠశాలలో మంగళవారం గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో స్వచ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు గెయిల్ ఇండియా ప్రతినిధులు ఫైనాన్స్ మేనేజర్ గోపిచంద్ నాయక్, సీనియర్ ఆఫీసర్లు జి.వెంకటరమణ, అభిషేక్, కె.ఠాకూర్, సూపరింటిడెంట్ వరుణ్ ఉమాశంకర్ హాజరయ్యారు. పాఠశాల శుభ్రతకు అవసరమైన డస్ట్‌బిన్‌లు, ఫినాయిల్, సామగ్రిలను అందించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛ పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'

సీతానగరం, జూలై 9: సీజనల్ వ్యాధులపైఅప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమారి అన్నారు మంగళవారం సీతానగరంలోని అంగన్‌వాడీ కేంద్రంవద్ద స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలు తినాలని, ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. గర్భిణులు, రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య లక్ష్మిదైవ కృప, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

'గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి'

దివాన్‌చెరువు, జూలై 9: గర్భిణులు మంచిపోషకాహారం తీసుకోవాలని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.శ్రీరాణి అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా పి.హెచ్.సిలో మంగళవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత లేకుండా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పి.హెచ్.సి. వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో జరిగిన పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో 32 మంది గర్భిణులకు వివిధ ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశామని అన్నారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరుకాలేక పోయిన గర్భిణులకు బుధవారం కూడా ఆరోగ్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ఇచ్చిన హామీని నెరవేర్చిన ప్రభుత్వం

- బుర్రిలంక ఇసుకర్యాంపులో ఉచిత ఇసుక ప్రారంభం: ఎంపీపీ ప్రసాద్




ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

కడియం, జూలై 9: ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుకవిధానం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర నాయకులు, కడియం మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్ అన్నారు. రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు కలిసి మంగళవారం బుర్రిలంక-వేమగిరి ఇసుకర్యాంపులో ఉచిత ఇసుకను ప్రారంభించారు. కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ జరిగిందని, దీంతో నిర్మాణ రంగం కుదేలైందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం వలన అన్నివర్గాల ప్రజలకు, ముఖ్యంగా నిర్మాణరంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేదికాదని, పెద్దపెద్ద సంస్థల ద్వారా ఇసుకదోపిడీ నిర్వహించారన్నారు. గత ప్రభుత్వంలో వేలాది రూపాయలు ఖర్చు పెడితేగానీ లారీ ఇసుక దొరికేది కాదన్నారు ప్రజలు అవ స్థలు పడకూడదని, అన్నిరంగాలు బాగుండాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఉచిత ఇసుక విధానం పాలసీని తీసుకువచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం కేవలం కూటమి ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, వైస్ ఎంపీపీ పంతం గణపతి, టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, టీడీపీ నాయకులు పితాని శివరామకృష్ణ, వాసంశెట్టి నాగబాబు, సూరపురెడ్డి జానకిరామయ్య, వాసంశెట్టి బాలాజీ, అప్పారి అన్నవరం, తహసీల్దారు బి.రమాదేవి, రెవెన్యూ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దె ఇళ్లల్లోనే అంగన్‌వాడీ సెంటర్లు



మోతుగూడెం, జూలై 9: చింతూరు మండలం మోతుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో మోతుగూడెం ఎస్టీ కాలనీ 1 ఫోర్‌బై ఒ డియా క్యాంప్, ఇంతలూరు వాగు, ఎంసీడీ క్యాంప్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడంతో గర్భిణీలు, చిన్న పిల్లలు అంగ న్‌వాడీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ భవనం లేకపోవడంతో అదే గ్రామాల్లో ఓ చిన్న అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఈ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం భవనాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఈ గ్రామాలకు అంగన్‌వాడీ బిల్డింగులు కట్టడానికి అనుమతులు వచ్చాయని కానీ నిర్మాణాలు నిలిచిపోయా యన్నారు. ఈ కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మించే క్రమంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో అరకొర వసతులతోనే ఈ కేంద్రాలు పని చేస్తున్నాయి. వర్షాకాలంలో ఈ అద్దె ఇళ్ల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కష్టంగానే ఉం టుంది.అధికారులు స్పందించి ఈ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





తండ్రి వారసత్వంగా.. చోరీలు?

ప్రతి కొడుకూ తండ్రి వారసత్వంగా ఆస్తులు.. బాధ్యతలను తీసుకుంటాడు.. అతను మాత్రం చోరీలను వారసత్వంగా తీసుకున్నాడు.. రాజమహేంద్రవరంలోని కొంతమూరుకు చెందిన ఒక వ్యక్తి చోరీలు చేసేవాడు.. పలు కేసుల్లో నిందితుడు.. అయితే కరోనా సమయంలో అతను చనిపోయా డు.. ఆ తరువాత అతనిపై కేసులు క్లోజ్ అయిపోయాయి.. అయితే మంగళవారం మళ్లీ అతని ప్రస్తావన వచ్చింది.. ఎందుకంటే అతని కొడుకే చోరీల బాటపట్టాడు.. ఇటీవల పలు కేసుల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలు సేకరించగా అతని తండ్రిని మరొకసారి పోలీసులకు జ్ఞప్తికి తెచ్చాడు.. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. -8లో

ఇల్లు కట్టుకుంటే.. ఇసుక ఫ్రీ

సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.. ఎన్నికల హామీలో భాగంగా ఉచిత ఇసుకకు శ్రీకారం చుట్టారు.. కేవలం రవాణా ఖర్చులు చెల్లిస్తే సరి ఇసుక ఉచితం.. టన్నుకు అన్ని ఖర్చులు కలుపుకుని కేవలం రూ.270లే.. అయితే దూరాన్ని బట్టి ఇది మరికొంత పెరిగే అవకాశం ఉంది.. ఉచిత ఇసుక రవాణాను మంగళవారం లాలా చెరువు స్టాక్ పాయింట్ వద్ద మంగళవారం మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిం చారు.. గత ప్రభుత్వంలో ఇసుక అందక పేదోడు ఇంటి నిర్మాణం ఆగిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.. మా ప్రభుత్వంలో అలా కాకూడదనే ఉచిత ఇసుక విధానం తెచ్చామన్నారు. - 8లో



ఇసుక సంతోషమే : లాలాచెరువులో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక రవాణా ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో, కమిషనర్

కొవ్వూరులో రైళ్లు ఆపండి సార్!

కరోనా వచ్చింది.. కొవ్వూరులో రైళ్ల హాల్ట్‌ను నిలిపివేసింది.. స్టేషన్ ఉందన్న మాటే కానీ సుమారు 4 ఏళ్లుగా కొవ్వూరులో రైళ్లు ఆగడంలేదు.. ఇది ఒక్క కొవ్వూరు సమస్య కాదు.. చుట్టూ ఉన్న 100 గ్రామాల సమస్య.. గతంలో కొవ్వూరు వచ్చి రైలెక్కేవారు.. మరి నేడు రైలెక్కాలంటే రాజమహేంద్రవరం రావాల్సిందే.. సమస్య పరిష్కరిం చాలని గత వైసీపీ పాలకుల చుట్టూ తిరిగారు.. అదిగో అన్నారు.. ఇదిగో అన్నారు..ఒక్కరైలూ ఆపలేకపోయారు.. ప్రస్తుతం కూటమి నాయకులకు తమ సమస్యను విన్నవించుకుంటున్నారు. మంగళవారం కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలో కలిసి కొవ్వూరులో రైళ్ల హాల్ట్ పునరుద్ధరించాలని కోరారు.. -8లో

కోట్లు మింగేసిన.. ఘనులు!



సీనరేజీలో కోట్లు పిండేసి..బాకీ కాదనేసి..

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వడ్డింవాడు మనవాడైతే అడ్డేముంటుంది.. దోచుకోవచ్చు.. దాచుకోవచ్చు.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలా మంది పెద్దలు చేసిందిదే.ప్రస్తుతం అధికారం మారడంతో ఒక్కొక్కరి బాగోతం బయటపడుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆ కంపెనీ మొన్నటి వరకు క్వారీల నుంచి కాసులు పంట పండించుకుంది. లేటరైట్, గనులు, గ్రావెల్ తవ్వకాల నుంచి ముక్కుపిండి సీనరేజీ పేరుతో కోట్లకు కోట్లు దండేసుకుంది. ప్రభుత్వం తరఫున గనుల శాఖ చేయాల్సిన పనని జగన్ ప్రభుత్వం ఏకంగా ఆ కంపెనీకి అడ్డగోలుగా గతేడాది ఏప్రిల్‌లో కట్టబెట్టేసింది. నువ్వు ఎన్ని కోట్లయినా పిండుకో.ప్రభుత్వానికి నెలకు కేవలం రూ.9.70 కోట్లు కడితే చాలంటూ బంపర్ ఆఫర్ ఇచ్చేసింది. ఇంకేం..అప్పట్లో ఓ అధికార పార్టీ నేత అండదండలతో ఆ కంపెనీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెచ్చిపోయింది. క్వారీలు, గుట్టలు, లేటరైట్, గనుల నుంచి వెళ్లే ప్రతిలారీ నుంచి సీనరేజీ పిండేసింది. నెలకు ప్రభుత్వానికి కట్టాల్సిన దానికంటే రెట్టింపు సొమ్మును చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి మరీ ముక్కుపిండి రాబట్టింది. తీరా ఇటీవల ప్రభుత్వం మారడంతో ఆ కంపెనీ దందాకు చెక్‌పడింది. కానీ ప్రభుత్వానికి కట్టాల్సి ఉన్న సీనరేజీ డబ్బులు మాత్రం ఇప్పటికి కట్టకుండా డ్రామాలాడుతోంది. అప్పట్లో తన అనుయాయ కంపెనీకి జగన్ సర్కారు రూ.20 కోట్ల వరకు గుట్టుగా సీనరేజీ రద్దు చేయడాన్ని సాకుగా చూపుతోంది. ఆ రద్దు వల్ల తనకు రాబడి పడిపోవడంతో కట్టాల్సిన బాకీ నుంచి మినహాయింపు కోరుతోంది. ఎన్నికలకు ముందు అధికార పార్టీ పెద్దల ద్వారా రాయబారం నడిపింది. ఈలోపు కొత్త ప్రభుత్వం రావడంతో ఏం చేయాలో తెలీక అధికారుల ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు డ్రామా మొదలుపెట్టింది.

జగన్ సారూ.. ఉన్నారు?

గత జగన్ ప్రభుత్వంలో పాలన అంతా నిబంధనలకు విరుద్ధంగానే నడిచింది. గనులశాఖలో అయితే ఇక చెప్పనక్కర్లేదు. అడ్డగోలు నిర్ణయాలతో ఖజానాకు కోట్లలో గండి పడింది. వ్యక్తులకు మాత్రం భారీగా ఆర్థిక లబ్ధి

- సీనరేజీ కాంట్రాక్టులో అక్రమం
- ఏడాదికి రూ.407 కోట్ల ఆదాయం
- రెండేళ్లకు రూ.223 కోట్లకే ఒప్పందం
- అడ్డగోలుగా కట్టబెట్టిన జగన్ సర్కారు
- సర్కారుకు రూ.25 కోట్లకుపైగా బకాయి
- చెల్లించకుండా తప్పించుకునే యత్నం
- గనుల శాఖ నుంచి ఒత్తిడి
- ఉలుకూపలుకూ లేని సుధాకర్ ఇన్‌ఫ్రా
- జగన్ కంపెనీకి రూ.20 కోట్లు రద్దు?
- దానివల్ల రాబడి తగ్గిందని వింత వాదన
- బాకీలో మినహాయించాలని డిమాండ్
- కాంట్రాక్టు కంపెనీకి అధికారుల వత్తాసు
- ఎన్నికల ముందు ప్రభుత్వానికి లేఖ
- ప్రభుత్వం మారడంతో కంపెనీకి షాక్
- మే నుంచి నిలిచిన వసూళ్ల దందా

చేకూర్చేలా అప్పటి పాలకులు నిర్ణయాలు తీసుకున్నారు. జగన్‌కు చెందిన ఓ బినామీ కంపెనీ రౌతులపూడిలో భారీ కొండలో నల్లరాయి క్వారీ మైనింగ్‌కి అనుమతులు పొందగా దాని మైనింగ్‌కు సంబంధించి ప్రభుత్వానికి కోట్లలో సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అప్పటి ప్రభుత్వం పూర్తిగా ఈ కంపెనీ కోసం నిబంధనలకు పాతరేసింది. ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనుల శాఖకు కట్టక్కర్లేకుండా ఏకంగా మినహాయింపు ఇచ్చేసింది. తద్వారా రూ.20 కోట్ల వరకు సదరు కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిపెట్టింది. సీనరేజీ మినహాయింపు ఆదేశాలు మూడో కంటికి తెలియకుండా రహస్యం పాటించారు. ఇదంతా ఒకెత్తయితే నెలనెలా ప్రభుత్వానికి సుధాకర్ ఇన్‌ఫ్రా కట్టాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులను కొంతకొంతగా ఎగ్గొడుతూ వస్తోంది. ఇదేంటని అడిగితే జగన్ అనుయాయ కంపెనీకి రూ.20 కోట్ల వరకు సీనరేజీ మినహాయింపు ఇవ్వడంతో తన రాబడి తగ్గిపోయిందని కొన్ని నెలల కిందట కొత్త వాదన తెచ్చింది. ఈ నేపథ్యంలో రద్దు చేసిన రూ.20 కోట్ల సీనరేజీ డబ్బులో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్త పాట పాడింది. ఈ కంపెనీ వెనుక వైసీపీ నేత ఉం డడంతో కాకినాడ గనుల శాఖ ఉన్నతాధికారులు మొత్తబడ్డారు. సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా నెలవారీ చెల్లించాల్సిన సీనరేజీ కాంట్రాక్టు డబ్బులు బాకీ ఉందని, ఈ బాకీలకు ఓ కంపెనీకి ప్రత్తిపాడు నియోజకవర్గంలో రద్దు చేసిన రూ.20 కోట్లకు పైగా సీనరేజీ డబ్బుల్లో కొంత మొత్తాన్ని సర్దుబాటు చేయాలంటూ లేఖ రాశారు.అయితే అప్పటికే రాష్ట్రంలో ఎన్నికల హడావుడి మొదలవడం, ఎన్నికల కోడ్ కూడా వచ్చేయడంతో గత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. కానీ తాను అనుకున్న పని పూర్తి చేయించుకోవడం కోసం సుధాకర్ ఇన్‌ఫ్రా తెగ ప్రయ త్నాలు చేసింది. నెలనెలా కోట్లలో రెట్టింపు రాబడి పిండేసినా కట్టాల్సిన రూ.25 కోట్ల బాకీ చెల్లించకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేసింది. ఈలోపు ఎన్నికలు జరగడం, తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ బాకీలు కట్టకుండా ఆగిపోయింది. ఊహించని విధంగా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో సదరు కంపెనీకి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. కట్టాల్సిన బాకీలు చెల్లించాల్సి రావడం, అటు ప్రభుత్వం మారడంతో సీనరేజీ వసూలు కాంట్రాక్టు నుంచి కూడా తప్పుకోవాల్సి రావడం పెద్ద షాక్‌కు గురిచేసింది. దీంతో ఇప్పుడు సీనరేజీ వసూలు ఎక్కడికక్కడ ఈ కంపెనీ చేయకుండా గనులశాఖ డీడీ కార్యాలయం చెక్‌పెట్టింది. కొత్త ప్రభుత్వంలో తన ఆటలు సాగే అవకాశం లేకపోవడంతో రూ.25కోట్లు ఎగ్గొట్టే ఎత్తు గడలో భాగంగా తిరిగి జిల్లా అధికారుల ద్వారా మళ్లీ ఫైలును పైకి పంపేందుకు ఎత్తుగడ వేస్తోంది.

రూ.814 కోట్ల ఆదాయం వచ్చేది.. 233 కోట్లకే కట్టబెట్టేసి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనుల శాఖకు చిన్న తరహా ఖనిజాల ద్వారా వచ్చే సీనరేజీ ఆదాయం రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి సమకూరడం లేదు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాయి కొండలు, గ్రావెల్, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడివస్తోంది. వీటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా సీనరేజీతో పాటు రకరకాల ఫీజుల ఆదాయం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు వచ్చేది. అయితే చిన్న ఖనిజాలకు సంబంధించి సీనరేజీ రాబడి ఇంకా వచ్చే అవకాశం ఉన్నా గనుల శాఖ పెద్దగా దృష్టి సారించేది కాదు. కేవలం ఎంత ఆదాయం వస్తే అంత అన్నరీతిలో వ్యవహరించేది. సరిగ్గా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపై కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. దీని వెనుక భారీ తతంగం నడిపారు. టెండర్ల జారీ దగ్గర నుంచి దా ఖలు వరకు మూడో కంటికి తెలియకుండా అంతా రహ స్యంగా నడిపారు. దీంతో ప్రభుత్వ పెద్దలు తాము అను కున్న కంపెనీకే ఈ కాంట్రాక్టు కట్టబెట్టారు. గనుల శాఖ ను పూర్తిగా డమ్మీగా మార్చేసి సీనరేజీ వసూలు బాధ్యత నుంచి తప్పించేసి పెత్తనమంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టేశారు. గనుల శాఖతో సంబంధం లేకుండా ఈ కంపెనీకి సర్వాధికారాలు ఇచ్చేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు కాంట్రాక్టు కట్టబెట్టేశారు. రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తే చాలని కాంట్రాక్టులో పేర్కొన్నారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్లు చొప్పున 24 వాయి దాల్లో చెల్లించొచ్చని వెసులుబాటు ఇచ్చేశారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు సదరు కంపెనీ నుంచి భారీగా పిండేశారు. ఇంకేం ప్రభుత్వం అండదండలు ఉండడంతో సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలున్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించేసింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. రాజ మహేంద్రవరం ఆటోనగర్, ధవళేశ్వరం బ్యారేజీపై కూడా తాత్కాలిక చెక్ పోస్టులు పెట్టేశారు. రాత్రీ పగలూ తేడా లేకుండా ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వకున్నా ముక్కుపిండి సీనరేజీ వసూలు చేసేవారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్ల రాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా ముక్కు పిండి నెల నెలా కోట్లలో డబ్బులు పిండేసింది. తెర వెనుక కాకినాడ జిల్లాకు చెందిన ఓ కీలక వైసీపీ నేత సహకారం ఉండడంతో గనులశాఖ సైతం కళ్లుమూసే సుకుంది.సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ. 9.70కోట్ల కంటే అంతకుమించి రెట్టింపు ఆదాయం పిండేసింది. ఒకరకంగా చెప్పాలంటే సీనరేజీ కాంట్రాక్టు ఈ కంపెనీకి కాసుల పంట పండించింది.

అధికారులేమో బాకీ డబ్బుల కోసం ఆ కంపెనీపై ఒత్తిడి తేకుండా సహకరిస్తుండడం విశేషం.

గడువు ముగిసిన రోజే నోటిఫికేషన్

ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9 : జిల్లాలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను 2024-25 సంవత్సరానికి పునరుద్ధీకరణ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రాజమహేంద్రవరం జిల్లా ఐడీ కళాశాల అధికారులు మంగళవారం తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఎయిడెడ్ ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులు తమ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీలోపు సంబంధిత ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరడం గమనార్హం. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఎయిడెడ్ ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో 2024 మార్చి 31వ తేదీ నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తులు, దస్త్రాలను ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారు 11వ తేదీన జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాలని, అనంతరం 15వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లో సెలక్షన్ కమిటీ వారి సమక్షంలో ఒప్పంద అధ్యాపకులు రెన్యువల్‌కు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

రోజుకు ఒక్కొక్కరికీ 20 టన్నుల ఇసుక



రాజమహేంద్రవరం రూరల్ జూలై 9 : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారులకు ఇసుక పంపిణీ చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. రూరల్ మండలం పరిధిలో కాతేరు ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆర్డీవో చైత్రవర్షిణి, ఇతర అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కాతేరు ఇసుక పాయింట్ వద్ద సుమారు 7 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక పంపిణీ విషయంలో నియయ నిబంధనలు అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ఇంటి ప్లాన్ ప్రకారం అవసరమైన మేరకు మాత్రమే ఇసుక విడుదల చేయాలన్నారు. గరిష్ఠంగా 20 మెట్రిక్ టన్నుల వరకూ మాత్రమే ఒక వ్యక్తికి ఒక రోజులో సరఫరా చేయడానికి ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహశీల్దార్ వైవీకే.అప్పారావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

గోకవరం, జూలై 9 : మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఇసుకను ఉచితంగా అందజేసి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకుందని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఆచంట రాజు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని హర్షిస్తూ గోకవరంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు ఆనందోత్సవ ర్యాలీ చేశారు. ముందుగా భవన నిర్మాణ కార్మికులు దేవిచౌక్ సెంటర్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి, సీఎం చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం అక్కడ నుంచి పాత బస్టాండ్ మీదుగా పంచాయతీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు

రాజమహేంద్రిని సుందరీకరిస్తాం

- దీర్ఘకాలిక ప్రణాళికతో ఓ మాస్టర్‌ప్లాన్
- మూడు నెలల్లో కార్యాచరణ - పుష్కరాలకు మార్పు
- గోదావరిలో 3 గంటలు బోట్‌పై పరిశీలన
- మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, జూలై9(ఆంధ్రజ్యోతి) : వచ్చే 2027 పుష్కరాల నాటికి గోదావరి రివర్ ఫ్రంట్ సుందరీకరణతో పాటు రాజమహేంద్రవరం నగరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కార్పొరేషన్, టూరిజం శాఖ అధికారులతో కలిసి మంగళవారం గోదావరిలో బోట్‌మీద పుష్కరఘాట్, కోటిలింగాలరేవు, సరస్వతిఘాట్, హేవలాక్ బ్రిడ్జి, గోదావరి రైల్వే వంతెనలు, రివర్ ఫ్రంట్ భాగం, గోదావరి లంకలు పరిశీలించారు. ఉదయం నుంచి సుమారు 3 గంటల సమయం వీరు గోదావరిలో బోటులోనే ఉన్నారు. టూరిజం అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యాటక ప్రాధాన్యత వివరించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం నగరానికి పర్యాటక ప్రాంతంగా అంతర్జాతీ స్థాయి గుర్తింపు వచ్చేలా ఇప్పటి నుంచే ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. రానున్న మూడు నెలల్లో కార్యాచరణ చేపడతామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ 2027 నాటి పుష్కరాలను దృష్టిలో ఉంచుకునే స్వయంగా బోటులో ప్రాంతాలను పరిశీలించామన్నారు. వచ్చే పుష్కరాలకు భక్తుల తాకిడి ఎక్కువ స్థాయిలో ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ఓ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి నివేదిక సిద్ధం చేసిన తర్వాత నిధులకు ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గత మూడు పుష్కరాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతాన్ని, ఘాట్లను అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు మరో అవకాశం వచ్చిందన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మూడునెలల్లో ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రివర్ లోయర్ ఫ్రంట్‌కు సంబంధించి ఇప్పటికే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. వారి వెంట కమిషనర్,ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, టూరిజం జాయింట్ డైరెక్టర్ వి.స్వామినాయుడు,ఎస్ఈ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల పనైపోతోంది!

- స్టేషన్‌లో ఎడాపెడా పనులు..
- ప్రయాణికులకు ఇక్కట్లు
- 3 ప్లాట్‌ఫాంలపైనా ఇబ్బందులే
- పట్టించుకోని రైల్వే అధికారులు



రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో సా..గుతున్న పనులు

రాజమహేంద్రవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో వింత పరిస్థితి నడుస్తోంది. అధికశాతం రైళ్లను నిలిపే మూడు ప్లాట్‌ఫాంలపై కూడా ఏదొక మరమ్మతుల పని జరుగుతూనే ఉంది. దీంతో రైలు ఎక్కి, దిగే హడావుడిలో ఎవరు ఏ ప్రమాదానికి గురవుతారోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రయాణికుల భద్రత రీత్యా పనులు చేస్తుండడం హర్షించదగిన విషయమే అయినా శాఖల నడుమ సమన్వయం కొల్పోవడం బాధాకరంగా ఉంది. దీంతో రద్దీ సమయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో మే 5న రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌పై గూడ్స్ రైలు పట్టాలు తప్పడంలో ఒక్కసారిగా అధికారులకు మరమ్మతులు గుర్తొచ్చాయి. అప్పటి వరకూ వదిలేసి రైలు పట్టాలు తప్పిన తర్వాత అన్ని విభాగాలూ మూకుమ్మడిగా పనులు ఆరంభించడంతో ఇబ్బందులకు అవకాశం ఇచ్చినట్లయింది. ఈ స్టేషను గుండా రోజూ సుమారు 90 వరకూ ప్రయాణికుల రైళ్లు, 60 గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. దాదాపు 10 వేల మంది ప్రయాణాలు చేస్తారు. నాలుగు జిల్లాల రైలు ప్రయాణికులకు గేట్‌వేగా ఈ స్టేషను ఉంది. అలాంటి స్టేషనులో ఎడాపెడా అన్ని పనులూ ఒకేసారి చేస్తుండడం సమస్యగా మారింది. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ట్రాక్‌పై సోమవారం(8వ తేదీ) నుంచి నెలాఖరు వరకూ రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. రెండో నెంబరు ట్రాక్ పనులను గత నెల 18న పూర్తి చేశారు.కానీ ప్లాట్‌ఫాంపై టైల్స్ వేయకపోవడంతో ప్రయాణికుల రైళ్లకు మరికొంత ఆలస్యమైంది.ఇప్పుడు రైళ్లు నడుస్తున్నా ఇంకా సిమెంటు పనులు జరుగుతూనే ఉన్నాయి. ప్లాట్‌ఫాంపై టైల్స్, ఇసుక ఉన్నాయి. ప్రయాణికులు ఇసుకపై నడుస్తూ జారితే ప్రమాదమే. మూడో నెంబరు ప్లాట్‌ఫాంపై మరమ్మతు పనులు చేస్తున్నారు. రైలు ఎక్కడానికి మూడు అడుగుల దూరంలో ఇవి జరుగుతున్నాయి. ఈ మధ్యలో ఆహార పదార్థాలు అమ్మేవారు ట్రేలను పెడుతున్నారు. దీంతో రైలు ఎక్కి, దిగేవారికి ఇబ్బంది అవుతోంది. రాత్రి వేళల్లో రద్దీ అధికంగా ఉండే సమయంలో ఎవరు ప్రమాదానికి గురవుతారో తెలియని పరిస్థితి ఉంది. అసలే 22 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతో ప్రస్తుతం నడుస్తున్న రైళ్లలో జనం కిక్కిరిసి ఉంటున్నారు. ఇక 4,5 ప్లాట్‌ఫాంలు ఉన్నా లేనట్టే. మరమ్మతు పనులు చేస్తున్నా ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే స్టేషనులోని ఒకటో ప్లాట్‌ఫాంకు వెళ్లకుండా రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న మెట్ల మార్గం ద్వారా నేరుగా 2, 3, 4, 5 ప్లాట్‌ఫాంలకు చేరుకొనే వెసులుబాటు ఉంది. కానీ ఇక్కడ టికెట్ బుకింగ్ కౌంటర్ లేదు. దీంతో టికెట్ తీసుకొనేవాళ్లు 1వ ప్లాట్‌ఫాంకు వెళ్లి మెట్ల మార్గం ద్వారా ఇతర ప్లాట్‌ఫాంలకు వెళ్తున్నారు. ఇదీ ఇబ్బందిగానే ఉంది. అందువల్ల ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ట్రాక్‌కి మరమ్మతులు పూర్తయ్యే వరకూ రైల్ కోచ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న మెట్ల మార్గం ప్రవేశంలో టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేస్తే మరమ్మతులు జరుగుతున్న మొదటి ప్లాట్‌ఫాంపైకి ప్రయాణికులు వెళ్లే సమస్య తగ్గే అవకాశం ఉంది. అలాగే స్టేషను ప్రాంగణంలో, ప్లాట్‌ఫాంలపై ప్రవేశ, నిర్గమ మార్గాలను తెలిపే సూచన బోర్డులు పెడితే మేలుగా ఉంటుంది.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

లేకుంటే చర్యలు తప్పవు: డీఎంఅండ్‌హెచ్‌వో



తాళ్లపూడి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, జూలై 9: ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రైవేటు ఆసుపత్రులు పని చేయాలని, నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తప్పవని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆయన మంగళవారం తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం సూచించే ఆదేశాలను పాటించాలన్నారు. గర్భిణులకు సిజేరియన్ కాకుండా సాధారణ డెలివరీలు చేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం అమలులో భాగంగా జిల్లాలోని ప్రతి ప్రభుత్వాసుపత్రిని సందర్శిస్తున్నట్టు చెప్పారు. తాళ్ళపూడిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిపై ఉన్నతాధికారులకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్టు చెప్పారు. ఈ విచారణలో ఆయనతో పాటు ఎస్‌వో, సిబ్బంది పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట డాక్టర్ హారిక గుప్త, సీహెచ్‌వో ఎం.వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి మహర్దశ



ప్రభుత్వాసుపత్రి అప్‌గ్రేడేషన్ కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జూలై 9: నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి మహర్దశ పట్టనుంది. ఇప్పటికే ఇందుకోసం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రభుత్వానికి విన్నవించారు. నిన్న రాజమహేంద్రవరంలో సైతం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి వినతిపత్రం అందించడంతో ఆయన కూడా సానుకులంగా స్పందించినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆసుపత్రి అప్ గ్రేడ్ కోసం మంగళవారం నల్లజర్లలోని టీడీపీ కార్యాలయంలో వైద్య సిబ్బంది జీవీవీ ప్రసాద్‌తో వివరాలు తెప్పించుకుని మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. బైపాస్‌ను ఆనుకుని ఉన్న నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి 24గంటలూ ప్రమాద కేసులు, మెట్ట ప్రాంతం కావడంతో పాము కాటు, విద్యుత్ షాక్, కుక్కకాటు, గర్భిణులు పురిటి కేసులు నిత్యం వస్తున్నా పగలు మాత్రమే వైద్య సేవలందించి రాత్రులు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల చాలా మంది వైద్యం కోసం 50 కిలోమీటర్లు దూరంలో ఉన్న రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ వెళ్లవలస్సి వస్తుందని గుర్తించారు. నల్లజర్ల ఆసుపత్రిని అప్‌గ్రేడేషన్ చేస్తే 24గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందిస్తారని, ప్రస్తుతం అప్ గ్రేడేషన్ చేసే ప్రక్రియ జరుగుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి చెప్పారు.

కోటసత్తెమ్మకు బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నిడదవోలు, జూలై 9: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తల్లికి ఆషాడమాసం సందర్భంగా మంగళవారం రాజమండ్రికి చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.

మహిళా ఉద్యోగుల రక్షణకు కమిటీలు

పెరవలి, జూలై 9: ఆయా కార్యాలయాల్లో మహిళా ఉద్యోగుల రక్షణార్థం కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు తహశీల్దార్ సుధ తెలిపారు. దీనికోసం పెరవలి తహశీల్దార్ కార్యాలయానికి సంబంధించి ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులుగా నలుగురు ఉంటారని వారిలో డిప్యూటీ తహశీల్దార్ కనకదుర్గ, ప్రెసిడెంగ్ అధికారిగా ఆర్ఐ పావని, జూనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, అలాగే సోషల్ సర్వీస్ తరుపున ఉదయభాస్కరరావు కమిటీ సభ్యులుగా పని చేస్తారన్నారు. ఈ కమిటీ తహశీల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై ఎవరైనా హింసకు పాల్పడినా, వారి పట్ల అనుచితంగా ప్రవర్తించినా వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరతారని, ఆ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తారన్నారు. ఇదేవిధంగా మిగిలిన ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా కమిటీలు ఏర్పాటు చేయనున్నామని, ఈ కమిటీలన్నింటికీ నోడల్ అధికారిగా ఎంపీడీవో హిమమహేశ్వరి వ్యవహరిస్తారని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



కె.సావరంలో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 9: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పారిశ్రామికవేత్త, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. కె.సావరం గ్రామంలో మంగళవారం తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ సభ్యుడు సుంకవల్లి చిరంజీవికుమారి పుట్టినరోజు సందర్భంగా స్థానిక పాఠశాల విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ వంక రాజకుమారి మొక్కలు నాటారు. మొక్కల ద్వారా వాతావరణం సమతుల్యత పాటిస్తుందని ఎమ్మెల్సీ అన్నారు. అనంతరం రవీంద్రనాథ్ రాజకుమారి దంపతులను సర్పంచ్ నార్ని రామకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కుంకట్ల వెంకటరత్నం, జోన్ ఛైర్మన్ చిట్టూరి సుజాత, శేషారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కల పంపిణీ

తాళ్లపూడి, జూలై 9: మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు ఎన్ఆర్‌జీఎస్, హార్టికల్చర్ ద్వారా కొబ్బరి, పామాయిల్ మొక్కలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో సీహెచ్ రమాదేవి తెలిపారు. మూడేళ్లపాటు మొక్కల పోషణకై రైతులకు ప్రోత్సాహకంగా కొంత నగదును కూడా అందిస్తామన్నారు. అన్నదేవరపేటలో టీడీపీ నాయకుడు అల్లూరి విక్ర మాదిత్య పాల్గొని మొక్కలు నాటారు. తాళ్లపూడిలో మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, ప్రక్కిలంకలో సర్పంచ్ యాళ్ల స్వప్న, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరులో రైళ్ల హాల్ట్‌పై కేంద్రమంత్రికి వినతి

కొవ్వూరు, జూలై 9: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు భీమవరంలో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొవిడ్ అనంతరం దేశ వ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లలో రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించారని, కొవ్వూరులో రైళ్ల నిలుపుదల చేయకపోవడంతో పోలవరం ఏజన్సీతో పాటు, కొవ్వూరు, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాల్లోని సుమారు 100 గ్రామాల ప్రజలు ఇబ్బబందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి రద్దుచేసిన రైళ్లన్నింటినీ పునరుద్ధరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హజీబు జగన్నాథరావు, కొండపల్లి రత్నసాయి, టీడీఎల్ ప్రసాద్, రమణ, బీజేపీ ఇన్‌చార్జి బూసి సురేంద్రనాథ్ బెనర్జి తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన

నిడదవోలు, జూలై 9: చిన్నారులను తల్లిదండ్రులు పెంచే విధానంపైనే వారి భవిష్యత్ ఆధారపడి ఉంటుందని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అనూష అన్నారు. మంగళ వారం నిడదవోలు పట్టణంలోని శాంతినగర్ ఎస్టీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి మాట్లాడుతూ చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఎదగడానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.పద్మావతి, హెచ్ఎం కె.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల కడుపు నింపేందుకే ఉచిత ఇసుక విధానం

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- జిల్లాలో 7 ఇసుక స్టాక్ పాయింట్‌లు
- ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ 1800 4252540
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ మేరకు ఉచిత ఇసుకను వినియోగాదారులకు అందించే కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో ప్రారంభించడం శుభపరిణామం, గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కడుపుకొడితే కూటమీ ప్రభుత్వం కడుపు నింపే విధంగా ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉచిత ఇసుక పాలసీని మంత్రి దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్డీవో చైత్రవర్షిణిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వినియోగాదారుడు ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే ఇబ్బందులు పడడం చూశామని, దీంతో కేవలం ట్రాన్స్‌పోర్టేషన్‌కు రుసుము కట్టుకునేలా ఉచితంగా ఇసుక విధానాన్ని తీసుకొచ్చామన్నారు. గతం తాలూక ముసుగు తీసి వేసి ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని, గతంలో తాను కడియపులంకకు వెళ్లి పరిశీలించినప్పుడు అక్కడ అక్రమంగా నదీ గర్భంలోకి వెళ్లి ఇసుకను దోచేసిన సంఘటన వెలుగులోకి తీసుకొచ్చామన్నారు. జేపీ కంపెనీ, మరో కంపెనీలు చేసిన దానిపై సీబీఐ విచారణ జరపాలన కూడా సీఎం చంద్రబాబుకు లేఖ పంపినట్టు గుర్తుచేశారు. ఇసుకను బోట్స్‌మెన్ సొసైటీలను రివైజ్ చేస్తూ దానిని స్టాక్ పాయింట్‌కు తీసుకువచ్చి అక్కడ నుంచి పేదలకు ఉచితంగా అందించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జగన్ అతని ప్రజాప్రతినిధులు విచ్చలవిడిగా ఇసుకను దోచేశారన్నారు. జేపీ ఇచ్చే ఒక వేబిల్లుతో ఎన్నో ట్రిప్పులు వేసేవారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక దందాలో ఉన్న ప్రతి ఒక్కరు డేటా తమ వద్ద ఉన్నదని చర్యలు ఉంటాయన్నారు.

ప్రభుత్వానికి లాభాపేక్ష లేకుండా ఇసుక విధానం: కలెక్టర్

పేదలకు ఉచిత ఇసుక పాలసీ ప్రారంభించామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్టాక్ పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆధార్ కార్డు, ఇంటి ప్లాన్ అప్రూవల్ కాపీ తీసుకుని రావాలన్నారు. పాత ఇళ్లు మరమ్మతులు చేయించుకునేవారు పాత ప్లాన్లు తీసుకుని రావాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ డిపార్టుమెంట్‌ల సమన్వయంతో ఇసుక పాలసీని సమర్థంతంగా అమలు చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలి పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద విజిలెన్స్ వుంటుందన్నారు. ఇతర జిల్లాలకు ఇసుక ఇవ్వాల్సివుంటుందన్నారు. విశాఖ జిల్లాకు ఇవ్వాల్సి వుంటుంది అటువంటి వాటికి కలెక్టర్ రిక్వస్ట్ ద్వారా ఇవ్వాల్సివుందన్నారు.. బోట్స్‌మెన్ సొసైటీల డిసిటేషన్‌కు సంబంధించి ధవళేశ్వరం సీఈ వారు చూస్తున్నారన్నారు. స్టాక్ పాయింట్‌లో డిప్యూటీ తహశీల్దార్లను పెడుతున్నామన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1800 4252540కు ఫోను చేయాలని చెప్పారు. ప్రజలు తమకు నచ్చిన వాహనాల్లో వచ్చి లోడింగ్ చార్జీలు చెల్లించి నేరుగా ఇసుకను తీసుకువెళ్లవచ్చని తెలిపారు. జిల్లాలో 7 ఇసుక స్టాక్ పాయింట్‌లు ఉన్నాయని, వాటిలో చిడిపి స్టాక్ యార్డ్ వద్ద 36,051 టన్నులు, పందలపర్రు స్టాక్ పాయింట్‌లో 52,082 టన్నులు, పెండ్యాలలో 1,46,259 టన్నులు, ఉసులుమర్రులో 33,065 టన్నులు, కాతేరులో స్టాక్ యార్డ్‌లో 6,939 టన్నులు, లాలా చెరువు వద్ద 7,403 టన్నులు, బుర్రిలంక స్టాక్ పాయింట్ వద్ద 20,862 టన్నులు ఇసుక ఉందని తెలిపారు. టన్ను ఇసుక ధర రూ.270గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నూతన ఇసుక విధానంలో దుర్వినియోగం చేస్తే సహించేదిలేదని, ఇసుక బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ సుబ్రహ్మణ్యం, ఆర్డీవో శ్రీదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, నక్కా దేవివరప్రసాద్, కోసూరి చండీప్రియ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

సామాన్యుడికి అందుబాటులో ఇసుక

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కుమారదేవం స్టాక్ పాయింట్‌లో ఉచిత ఇసుక పంపిణీ



కొవ్వూరు: కుమారదేవంలో ఇసుక పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 9: సామాన్యుడికి ఇసుక అందుబాటులో తీసుకురావాలని ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుక స్టాక్ పాయింట్‌లో ఉచిత ఇసుక పథకాన్ని గండి పోచమ్మకు పూజలు చేసి సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014-19లో పేదవాడికి ఇసుక అందుబాటులో ఉండాలని చంద్రబాబు ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేశారని, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఇసుక పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుందన్నారు. ఇసుక కాంట్రాక్టర్లు కొందరు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కొవ్వూరులో ఉన్నాయన్నారు. ప్రస్తుత విధానంలో టన్ను ఇసుకను రూ.270కు ప్రభుత్వం అందిస్తోందని, కొవ్వూరు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా కొవ్వూరులోని ఔరంగాబాద్ ఇసుక ర్యాంపును ఎమ్మెల్యే ముప్పిడి, సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ పరిశీలించారు. ఈ సందర్భంగా బోట్స్‌మెన్ సొసైటీ నాయకులు, పడవ కార్మికులు, యజమానులు మాట్లాడుతూ పడవకార్మికులు నదిలోకి వెళ్లి తవ్వకాలు జరిపి ఒడ్డుకు తీసుకు వచ్చిన ఇసుక ర్యాంపుల్లో గుట్టలుగా ఉందన్నారు. గోదావరికి త్వరలో వరదలు వచ్చే అవకాశం ఉందని, గుట్టలుగా పోసిన ఇసుకంతా గోదావరిలోకి కొట్టుకు పోతుందన్నారు. అందుచేత ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో ముందుగా ర్యాంపుల్లో గుట్టలుగా ఉంచిన ఇసుకను విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ పడవ కార్మికులు కష్టం గోదావరి పాలు కాకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేష్, ఏజీఆర్‌బీ ఏఈ ఆర్.సునీల్‌బాబు, తహశీల్దార్ కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి

నిడదవోలు, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమని, దీని వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. మంగళవారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ బలహీనవర్గాల అభ్యున్నతితో పాటు రాష్ట్ర ప్రగతికి బాట వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే ప్రభుత్వ విధానమని పారదర్శకత ముందు చూపుతోనే ఇసుక పాలసీని రూపొందించారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియాతో జగన్‌రెడ్డి రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టాడన్నారు. వైసీపీ నేతలే స్వయంగా ఇసుకాసుర అవతారాలు ఎత్తి దోచుకున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, బుగ్గే శివరామకృష్ణశాస్త్రి పాల్గొన్నారు.



నిడదవోలులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శేషారావు

ఉసులుమర్రులో స్టాక్ పాయింట్

రోజుకు ఒక వ్యక్తికి 20 టన్నులే అనుమతి: తహశీల్దార్ సుధ



స్టాక్ పాయింట్ వద్ద ఇసుక పంపిణీ ప్రారంభిస్తున్న తహశీల్దార్ సుధ

పెరవలి, జూలై 9: ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయడానికి తీపర్రు-ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వద్ద మంగళవారం నుంచి ఎగుమతులు ప్రారంభించినట్టు తహశీల్దార్ డి.సుధ తెలిపారు. ఇక్కడ స్టాక్ పాయింట్ వద్ద సుమారు 34 వేల టన్నులు నిల్వ ఉందని, టన్ను రూ.270 చొప్పున ఒక రోజుకు ఒకరికి 20టన్నులు మించకుండా ఇసుక ఇస్తారన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆధార్‌కార్డు, ఇంటి ప్లాన్ అప్రూవల్ కాపీ తీసుకురావాలని, నామమాత్రపు సొమ్మును ఇక్కడే ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో హిమమహేశ్వరి, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి డిప్యూటీ తహశీల్దార్ సన్నిబాబు, మండల సర్వేయర్ గోపాలకృష్ణ, ఉసులుమర్రు సర్పంచ్ వీరమళ్ల నాగలక్ష్మి, నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, మొగళ్లపు సీతారామ్, నందమూరి నారాయణరావు పాల్గొన్నారు.

కూలీలతో ఎగుమతి చేయించాలి

తీపర్రు-ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వద్ద ఎగుమతి చేస్తున్న ఇసుకను యంత్రాలతో కాకుండా కూలీలతో చేయించాలని దీని వల్ల తమకు జీవనోపాధి లభిస్తుందని ఉసులుమర్రుకు చెందిన ఇసుక ముఠా కార్మికుల సంఘం తహశీల్దార్ సుధను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో 931 మంది కార్మికులు కుటుంబాలతో జీవిస్తున్నారని, ఉసులుమర్రు వద్ద గోదావరి తీరంలో ఇసుక ఎగుమతి జీవనాధారంగా బతుకుతున్నామని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

ఎన్నికల్లో కూటమి విజయానికి జనసైనికుల కృషి

- దుద్దుకూరులో జనసేన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి



ఎమ్మెల్యే మద్దిపాటి, బాపిరాజులను సత్కరిస్తున్న జనసేన నాయకులు

దేవరపల్లి, జూలై 9: రాష్ట్రంలో రాక్షసపాలనను అంతమొందించి సుపరిపాలన అందించేందుకు ఎన్నికల్లో కూటమి విజయం కోసం జనసైనికులు ఎంతో కష్టపడి పనిచేశారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో మంగళవారం జరిగిన జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం, కూటమి విజయోత్సవ కృతజ్ఞత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టినప్పుడు పవన్‌కల్యాణ్ ఓట్లు చీలనివ్వనని టీడీపీకి మద్దతు ప్రకటించడంతో కూటమి విజయం ఖాయమైందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ సమన్వయంతో అన్ని స్థానిక సంస్థల్లో సమన్యాయం కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం దారిలో పడేవరకు అందరూ సంయమనం పాటించాలన్నారు. జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు మాట్లాడుతూ మూడు పార్టీలను ఒకే తాటిపైకి తెచ్చిన ఘనత పవన్‌కల్యాణ్‌కే దక్కుతుందన్నారు.2024 ఎన్నికల్లో పార్టీల సమన్వయం కోసం పెద్దన్న పాత్ర పోషించారన్నారు. ఎంపీగా పురందేశ్వరి, ఎమ్మెల్యేగా మద్దిపాటి విజయం కోసం గోపాలపురం ఇన్‌చార్జి సువర్ణరాజు, జనసేన నాయకులు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారన్నారు. సువర్ణరాజు మాట్లాడుతూ రాష్ట్ర, యువత భవిష్యత్ కోసం నిరంతరం పవన్‌కల్యాణ్ శ్రమిస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలతో పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణాలు సాధ్యమవుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి, బాపిరాజులను జనసేన ఆధ్వర్యంలో సత్కరించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు కట్నాం గణేష్, సీహెచ్. బాలరాజు, నరసింహమూర్తి, రాజేంద్రబాబు, సర్పంచ్ శివనాగప్రసాద్, టీడీపీ నాయకులు సుబ్బారావు, ముళ్ళపూడి దొరాజీచౌదరి, రవికుమార్, జనసేన నాయకులు సంబా బాలశ్రీనివాస్, మాలే సతీష్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి

గోపాలపురం, జూలై 9: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి తమను ఆదుకోవాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ అన్నారు. హక్కుల దినోత్సవం సందర్భంగా నల్లజర్ల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. పలు డిమాండ్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు టీపీ లక్ష్మి, కార్యదర్శి రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీశంకర్

చాగల్లు, జూలై 9: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ఉపకరణాలు అందజేయడంతో పాటుగా ఉత్తమ విద్యాబోధన జరుగుతోందని సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీశంకర్ అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరు పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంఈవో యు.గురునాథం మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సీహెచ్ సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన మురళీమోహన్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9: రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని మాజీ ఎంపీ, సినీ నటుడు మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మురళీమోహన్ మంగళవారం ఎంపీని ఆమె నివాసంలో కలుసుకుని రాజమండ్రి ఎంపీగా ఘన విజయం సాధించడం పట్ల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, టీడీపీ నాయకుడు కాశి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు

కొవ్వూరు, జూలై 9: కోరిక తీర్చమని వరుసకు చెల్లెలను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. అన్న వరుసైన బాలుడు ఇంటికి వచ్చి కోరిక తీర్చమని వేధిస్తున్నాడని కొవ్వూరుకు చెందిన 16 ఏళ్ల బాలిక పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

అనంతపల్లిలో భారీ కొండచిలువ హతం



నల్లజర్ల, జూలై 9: మండలంలోని అనంతపల్లిలో 13 అడుగుల కొండచిలువను గ్రామస్థులు హతం చేశారు. ఉపాధి పనులు చేసే ప్రదేశంలో మంగళవారం కొండచిలువ ప్రత్యక్షం కావడంతో భయంతో కూలీలు పరుగులు పెట్టారు. గ్రామస్థులు గునపాలు, కర్రలతో కొట్టి చంపేశారు.

చిన్న వయసు నుంచే చోరీలు

- చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాల బాట
- యువకుడి అరెస్టు.. 212గ్రాముల బంగారం రికవరీ

రాజమహేంద్రవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): తండ్రి బాటలోనే నడిచిన కొడుకు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. చిన్న వయసులో చిన్న చోరీలతో మొదలుపెట్టి క్రమంగా పెద్ద చోరీలవైపు మళ్లాడు. ఓ కేసులో డొంక లాగిన పోలీసులకు చిక్కడంతో కటకటాల్లోకి నెట్టారు. ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్ వివరాల ప్రకారం.. కొంతమూరుకు చెందిన కొండేటి సాయి తండ్రి రాంబాబు చోరీలు చేసేవాడు. కరోనాతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో 10వ తరగతి వరకూ చదువుకొన్న సాయి 2017 నుంచే చిన్న చిన్న దొంగతనాలు చేయడానికి అలవాటు పడ్డాడు. మిల్క్ డైయిరీ, ఫ్లిప్‌కార్ట్ తదితర చోట్ల ఉద్యోగం చేశాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడడంతో జీతం సరిపోయేది కాదు. దీంతో మళ్లీ చోరీలవైపు మళ్లాడు. ఈసారి కాస్త పెద్ద దొంగతనాలపై దృష్టి పెట్టాడు. ఇళ్లలో రాత్రి వేళల్లో దొంగతనాలు చేసేవాడు. గత ఏడాది సెప్టెంబరు 22న పాత బొమ్మూరలోని ఓ ఇంట్లో జరిగిన చోరీపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి సాయిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామని డీఎస్పీ వివరించారు. అతడి వద్ద నుంచి 212గ్రాముల బంగారు, 1.5కిలోల వెండి ఆభరణాలు, రూ.90 వేల నగదు, ఒక మోటార్‌సైకిల్‌ని రికవరీ చేశామన్నారు. రాజానగరం పీఎస్‌లో రెండు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఒక చోరీ కేసు, అంబాజీపేట, సామర్లకోటలో బైండోవర్ కేసులు ఉన్నాయని, గడిచిన ఏడాది కాలంలో ఆరు కేసులు బొమ్మూరు పీఎస్‌లో నమోదయ్యాయని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐలు బి.శ్రీను, ఆర్.అంకారావు, ఏఎస్ఐ ఏకే సత్యనారాయణ, హెచ్‌సీ పి.వెంకటేశ్వరరావు, పీసీ కె.సురేశ్‌బాబును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

హోంగార్డులకు న్యాయం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: రాష్ట్రంలో ఉన్న 16వేల మంది హోంగార్డులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌లకు బాధిత హోంగార్డులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో వారిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. హోంగార్డులను రాష్ట్ర ప్రభుత్వ యూనిఫామ్ సర్వీసు డిపార్ట్‌మెంట్‌లలో సీనియారిటీ ప్రాతిపాదికన విలీనం చేయాలని, ఇతర శాఖా పరమైన బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. హోంగార్డు వ్యవస్థ 1963 నుంచి ఇప్పటివరకు వలంటీర్ వ్యవస్థగానే పరిగణిస్తున్నారని ఏళ్ల తరబడి పోలీసులతో సమానంగా పనిచేస్తున్న తమకు ఏలాంటి ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, టీఏ, డీఏ సదుపాయాలు లేవని, ఎటువంటి శాఖ పరంగా కానిస్టేబుల్‌గా పదోన్నతులు లేవన్నారు. హోంగార్డులుగా చేసి పదవీవిరమణ చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్

సంస్థ సీఎండీ పృథ్వీతేజ్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోనుపే, జీపే పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించకపోతే గనుక వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసికొనిగాని, సంస్థ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యుఏపీఈస్ట్రన్‌పవర్.కం నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌గాని వెబ్‌సైట్ ద్వారా గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోను పే, జీపే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సీఎండీ చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.